




teenmaardesk@gmail.com

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


## పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

రాష్ట్రపతికి జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ విజ్ఞప్తి

2 లో..




ములుగు | సంపుటి : 02 | సంచిక : 321 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 6 మార్చి 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.




### మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా టీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

జాతరకు వెయ్యి ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు

వెల్లడించిన ఆర్టీసీ కరీంనగర్ ఈడీ వినోద్ కుమార్

తెలంగాణ బ్యూరో, మార్చి 05 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి ఘనంగా నిర్వహిస్తారు. ఆ పర్వదినాన శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు బారులు తీరుతారు. తెలంగాణలోని శైవక్షేత్రాల్లో వేములవాడ రాజన్న ఆలయం ఒకటి. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి భక్తులు ఈ ఆలయానికి

మిగతా 2 లో



## గొర్రెలు, చేపల పథకాల లావాదేవీలపై విచారణ

# చేపట్టాలి



### విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బాధ్యతలు

ప్రాథమిక నివేదిక ఆధారంగా ఏసీబీకి


ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ప్రోత్సాహకం

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు వెయిటేజీ

అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 05 (తీన్మార్ న్యూస్): గొర్రెలు, చేపల పంపిణీ పథకాల్లో జరిగిన లావాదేవీలపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాలు ప్రారంభించినప్పటి నుంచీ ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక మొదలు గొర్రెల కొనుగోలు, పంపిణీ జరిగిన తీరుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని చెప్పారు. విజిలెన్స్ ఇచ్చే ప్రాథమిక నివేదికలో ఏమైనా అవినీతి, అవకతవకలను

మిగతా 2 లో



### దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే

# బిఎస్పీతో పొత్తు

బీఆర్ఎస్ పార్టీ భావ సారూప్యతతో పనిచేస్తున్న బీఎస్పీతో పొత్తును ప్రజలు హర్షిస్తారు

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే ఈ పొత్తు : కేసీఆర్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, దీర్ఘకాలిక లక్ష్యంతో బీఎస్పీతో పొత్తుపెట్టుకున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెల్లడించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఎస్పీతో పొత్తు ఉంటుందని మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు.

హైదరాబాద్, మార్చి 05 (తీన్మార్ న్యూస్): ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో చర్చలు, తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే నాటి ఉద్యమ కాలం నుంచి ప్రగతి కాలం వరకు పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అదే సైద్ధాంతికతో భావ సారూప్యతతో పనిచేస్తున్న బీఎస్పీతో పొత్తును ప్రజలు హర్షిస్తారని కేసీఆర్ తెలిపారు. ఇప్పటికే సానుకూల స్పందన వస్తున్నదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మనం మన శక్తులను కూడదీసుకోవాలన్నారు. కలిసి వచ్చే భావసారూప్య శక్తులను కలుపుకొని పోవాలని ఆ దిశగా మనం తీసుకున్న నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా

మిగతా 2 లో



### కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దురదృష్టం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కామారెడ్డి, మార్చి 05 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తిప్పారం గ్రామంలో పర్యటించారు. ఆ గ్రామానికి చెందిన హర్యల వెంకట్ బోధన్ హాస్టల్ లో మృతి చెందడం పట్ల ఆమె తను బాధను వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్, వాచ్ మెన్ లేకపోవడం ఒకరు చనిపోవడం ఎనిమిది మంది విద్యార్థులపై మర్డర్ కేసు నమోదైందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఎనిమిది మంది

మిగతా 2 లో

## హై కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థులు

ప్రజాభవన్ వద్ద తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి

2 లో..





### మార్చి 4న అర్ధరాత్రి ప్రారంభమైన డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ

ఏప్రిల్ 3 వరకు దరఖాస్తులకు అవకాశం

జీవో-3 ప్రకారం మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలు

.. వివరాలు 2లో



### విడుదలైన టీఎస్ఐసెట్-2024 నోటిఫికేషన్

ఈ నెల 7 నుంచి ఏప్రిల్ 30 వరకు స్వీకరించనున్న దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 05 (తీన్మార్ న్యూస్): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీఎస్ఐసెట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, టీఎస్ ఐసెట్-24 చైర్మన్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులు

మిగతా 2 లో



## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వినియోగదారులకు ఎలాంటి బిల్లు వసూలు చేయవద్దనే ప్రభుత్వ పథకంలో జరుగుతున్న పొరపాటు వల్ల లక్షలాది మంది అర్హులకు అన్యాయం జరుగుతుంది అని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.

తెలంగాణ బ్యూరో, మార్చి 05 (తీన్మార్ న్యూస్): కేవలం 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారు. కానీ, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా సరే మొత్తం 201 యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు అని పేర్కొన్నారు. వినియోగదారులు ప్రతీ రోజు పొద్దున లేచి తాము

మిగతా 2 లో



## అర్హులందరికీ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారెంటీ పథకాల డాక్యుమెంట్ సేకరణ

ములుగు, మార్చి 05 (తీన్మార్ న్యూస్): అర్హులందరికీ ప్రభుత్వ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి లతో కలిసి

మిగతా 2 లో

# దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే బిఎస్పీతో పొత్తు

**మొదటి పేజీ తరువాయి**

ప్రయోజనాలను కాపాడే దీర్ఘ కాలిక లక్ష్యంతో కూడుకుని ఉన్నదన్నారు. లౌకికవాద తాత్వికతతో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి ఆ దిశగా పదేండ్ల పాటు అనుసరించిన కార్యాచరణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ నేపథ్యంలో దళిత బహుజన శక్తులతో కలిసి పనిచేయడం ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మరింత చేరువవుతామన్నారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ బీఎస్పీలు కలిసికట్టుగా పనిచేసి ప్రజా అభీష్టాలను సంపూర్ణంగా నెరవేరుస్తామని కేసీఆర్ అన్నారు. ఈ దిశగా మరిన్ని చర్చలు జరిపి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుల విధి విధానాలను ఖరారు చేస్తామని అన్నారు. కాగా, బీఎస్పీతో పొత్తును సమావేశం హర్షధ్వానాల నడుమ ముక్తకంఠంతో ఏకీభవించింది. తన ప్రయత్నానికి మద్దతు ప్రకటించిన పార్టీ నేతలకు అధినేత ధన్యవాదాలు తెలిపారు.

# మహాశివరాత్రి పర్వదినం సందర్బంగా టిఎస్ఆర్టిసీ కీలక నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

పొటెత్తుతారు. ఈ నేపథ్యంలో ఈనెల 8న మహా శివరాత్రి ఉండగా భక్తులకు టీఎస్ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. వేములవాడ రాజన్న ఆలయంలో జరిగే మహా శివరాత్రి జాతరకు వెయ్యి ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ కరీంనగర్ ఈడీ వినోద్ కుమార్ వెల్లడించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 7న 7న 265, 8న 400, 9న 329 ప్రత్యకే బస్సులను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ స్పెషల్ బస్సులు వరంగల్, హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, నర్సంపేట, కోరుట్ల, మెట్పల్లి, ఆర్మూర్, కామారెడ్డి, నిర్మల్, వేములవాడ డిపోల నుంచి నడుస్తాయని చెప్పారు. ఈ మూడు రోజులు వేములవాడ బస్టాండ్ నుంచి ఆలయం వరకు దేవాలయం సౌజన్యంతో ఉచితంగా 14 మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భక్తులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దురదృష్టం

**మొదటి పేజీ తరువాయి**

విద్యార్థుల భవిష్యత్తు నాశనం కావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఈ సంఘటన జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత, పట్టింపులేని చర్యల వల్లనే ఈ సంఘటన జరిగిందని కవిత ఆరోపించారు. సీఎం కేసీఆర్ పైపడి ఏడ్చుడే తప్ప ఈ మూడు నెలల్లో ప్రజలకు చేసిందేమీ లేదు అని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు విద్య శాఖకు మంత్రి లేకపోవడం మన దురదృష్టం అని కవిత మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రివ్యూ నిర్వహించి పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించారు. మృతుని తల్లికి పెన్షన్, సోదరునికి ప్రభుత్వ ఉద్యోగం, 15 లక్షల నష్టపరిహారం, ఒక డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. %=ూా% మూలాలు ఉన్న రేవంత్ ప్రధాని మోడీని పెద్దన్న అనడంలో అతిశయోక్తి లేదు అని, కానీ తెలంగాణ కి బడ్జెట్ లో ఒక్క రూపాయి కేటాయించకపోవడం పై ఎందుకు ప్రశ్నించలేదు? అని కవిత అన్నారు. రాష్ట్రంలో వరుస ఆత్మహత్యలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మార్చి 4న అర్ధరాత్రి ప్రారంభమైన డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ

హైదరాబాద్, మార్చి 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ఇటీవల డీఎస్సీ 2024 నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 11, 062 పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనుంది. ఈ పోస్టులకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 4న రాత్రి 12 గంటల తర్వాత నుంచి ప్రారంభమైంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులకు అధికారిక వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కలిగింది. ఏప్రిల్ 3 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఏ జిల్లాలో ఏ సబ్జెక్టుకు ఎన్ని ఖాళీలు ఉన్నాయనే విషయాన్ని వివరిస్తూ విద్యాశాఖ వివరణాత్మక నోటిఫికేషన్‌ను కూడా ప్రకటించింది. సిలబస్‌లో ఎలాంటి మార్పులు చేయలేదని, పాత సిలబస్ ప్రకారమే డీఎస్సీ నిర్వహిస్తామని విద్యాశాఖ స్పష్టం చేసింది. డీఎస్సీ పరీక్షలను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)ల తేదీలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొంది. అభ్యర్థుల స్థానికతను నిర్ధారించేందుకు గతంలో 4 నుంచి 10 తరగతులను పరిగణనలోకి తీసుకునేవారు. అయితే తాజా నోటిఫికేషన్‌లో మాత్రం 1 నుంచి 7 తరగతులను లెక్కలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితికి సంబంధించి జులై 1, 2023వ తేదీనాటికి 46 సంవత్సరాల లోపు ఉండాలి. కనిష్ఠ వయోపరిమితి 18 ఏళ్లు నిండి ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, వికలాంగ అభ్యర్థులకు పదేళ్ల చొప్పున వయోపరిమితిలో సడలింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణ లేదా ఏపీ టెట్ లేదా సెంట్రల్‌టెట్(సీ టెట్)లో క్వాలిఫై అయినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఏజెన్సీ పోస్టుల్లో 100 శాతం గిరిజనులకే కేటాయించాలనే నిబంధనను తాజాగా ఎత్తివేసిన ప్రభుత్వం.. ఈ పోస్టులకు అందరూ పోటీపడే అవకాశం కల్పించింది. ఎస్టీ రిజర్వేషన్ గతంలో 6 శాతం ఉండగా, దానిని ఈసారి 10 శాతానికి పెంచారు. ఇంటర్ మార్కులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 40 శాతం ఉంటే పరిపోతుంది. గతంలో లోకల్, ఓపెన్‌కోటా రిజర్వేషన్ కింద 80:20 పద్ధతి అమలులో ఉండగా, దానిని ఈసారి 95:5 నిష్పత్తి చొప్పున అమలు చేస్తున్నారు. జీవో–3 ప్రకారం మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలుచేయనున్నారు. అంటే మూడు పోస్టులుంటే అందులో ఒకటి మహిళతో భర్తీ చేస్తారన్నమాట.

# విడుదలైన టీఎస్ఐసెట్-2024 నోటిఫికేషన్




**మొదటి పేజీ తరువాయి**

స్వీకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.550, ఇతరులు రూ.750 రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.250 అపరాధ రుసుముతో మే 17 వరకు, రూ.500 అపరాధ రుసుముతో మే 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. దరఖాస్తులో ఏమైనా తప్పులు, పొరపాట్లు ఉంటే అభ్యర్థులు మే 17వ తేదీ నుంచి 20 తేదీ మధ్య మార్పులు చేసుకోవచ్చు. మే 28వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూన్ 4వ తేదీన 2 సెషన్లు, 5వ తేదీన ఒక సెషన్ నిర్వహించనున్నారు. జూన్ 15న ప్రాథమిక కీ, జూన్ 16 నుంచి 19 మధ్య అభ్యంతరాల స్వీకరణ, జూన్ 28వ తేదీన ఫైనల్ కీ, ఫలితాలను జూన్ 28వ తేదీన విడుదల చేయనున్నారు.

# గొర్రెలు, చేపల పథకాల లావాదేవీలపై విచారణ చేపట్టాలి





**మొదటి పేజీ తరువాయి**

గుర్తిస్తే వెంటనే ఈ వివరాలను ఏసీబీకి అప్పగించాలని సీఎం అధికారులకు సూచించారు. మంగళవారం సచివాలయంలో పశు సంవర్ధక శాఖ, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవకతవకలు, ఇటీవల ఈ పథకంలో జరిగిన భారీ అవినీతిని కాగ్ తమ నివేదికలో వేలెత్తి చూపిన విషయాన్నిఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇటీవల గొర్రెల పంపిణీకి సంబంధించిన నిధులను బినామీ పేర్లతో కొందరు ఉద్యోగులు సొంత ఖాతాలకు మళ్లించుకున్న కేసులో ఏసీబీ దర్యాప్తు గుర్తు చేస్తూ అదులో శాఖాపరంగా వివరాలేమీ సేకరించలేదా అని ఆరా తీశారు. 2017లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంలో మొదటి విడతకు రూ. 3955 కోట్ల రుణం ఇచ్చిన చేసిన నేషనల్ కో ఆపరేటివ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ రెండో విడతకు ఎందుకు రుణం ఇవ్వటం నిలిపి వేసిందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. అప్పటికే ఈ పథకంపై కాగ్ వివిధ అభ్యంతరాలు లేవనెత్తడం, అవకతవకలను గుర్తించిందని, తదితర కారణాలతో ఎన్సీడీసీ రుణం ఇవ్వలేదని అధికారులు సమాధానమిచ్చారు. ఇప్పటికే తమ వాటా కింద 25 శాతం డీడీలు చెల్లించిన అందజేసిన లబ్ధిదారులకు ఎందుకు గొర్రెలను పంపిణీ చేయలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. రెండో విడతలో 85488 మంది ఇప్పటికే తమ వాటా కింద 25 శాతం డబ్బు చెల్లించారని, దాదాపు రూ. 430 కోట్లు జిల్లా కలెక్టర్ల ఖాతాల్లోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 2,20,792 మంది లబ్ధిదారులు ఇంకా డబ్బులు కట్టలేదని చెప్పారు. ఈ పథకం అమలు జరిగిన తీరుపై రకరకాల అనుమానాలున్నాయని, దీంతో పాటు చేపల పెంపకానికి సంబంధించి ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణకు ఆదేశాలు జారీ చేశారు. పాడి రైతులకు ప్రభుత్వం ఇచ్చే ఒక్కో లీటర్పై ఇచ్చే రూ.4 ప్రోత్సాహకం మూడేండ్లుగా ఇవ్వటం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. దాదాపు రూ.203 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. స్పందించిన ముఖ్యమంత్రి ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాన్ని క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు జరిగేలా చూడాలని చెప్పారు. ప్రతి మండలంలో వెటర్నరీ హాస్పిటల్ తప్పకుండా ఉండాలని, 91 కొత్త మండలాల్లోనూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ సేవలను కొనసాగించాలని, అందుకు అవసరమైన టెండర్లను వెంటనే పిలవాలని చెప్పారు. వివిధ పథకాల్లో కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. టీఎస్పీఎస్సీ చేపట్టిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల నియామకాల్లో ఈ విభాగంలో ఏళ్లకేళ్లుగా పని చేస్తున్న వారికి వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలించాలని, వైద్యారోగ్య శాఖలో అమలైన వెయిటేజీ విధానాన్నిఈ విభాగంలోనూ వర్తించేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## హై కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలి

హైదరాబాద్, మార్చి 05 (తీన్మార్ న్యూస్): హై కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తమకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రజాభవన్ వద్దకు తరలి వచ్చారు. రాష్ట్రనలుమూలల నుంచి దాదాపు 500 మంది డీఎస్సీ 2008 బాధితులు ప్రజాభవన్ వద్ద తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని... గతంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా తమకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలలోపే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి జీవితాల్లో వెలుగు నింపిన కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ 2008 కి చెందిన వెయ్యి మంది బాధితుల 15 ఏళ్ల కన్నీళ్లను తుడవాలని అభ్యర్థులు కోరారు. తమ డిమాండ్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని అభ్యర్థులు ప్రజాభవన్ ఎదుట బైఠాయించారు. 2008లో నాటి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6న 35వేల పోస్టుల్లో మెగా డీఎస్సీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎస్జీటీ పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని నాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. అనంతరం ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ 2009 జనవరి 29న జీవో నంబర్ 28ని విడుదల చేసింది. అయితే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ బీఈడీ అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని హైకోర్టు తీర్పు వెల్లడించింది. అంతేకాదు నాటి ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సైతం కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని సూచించింది. దీంతో నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో కౌన్సిలింగ్ ప్రక్రియ సైతం మ్మొదలైంది. అయితే డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో నాటి కౌన్సిలింగ్‌పై స్టే విధించింది. జీవో 28 ప్రకారం 30శాతం కోటా కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించాలని ట్రిబ్యునల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొత్త మెరిట్ లిస్టు విడుదల చేసి 2010లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో మంచి మార్కులు సాధించినా 3500 మంది బీఈడీ అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయారు. ఇలా ఉద్యోగాలు కోల్పోయిన వారిలో 1200 మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు సైతం ఉన్నారు. దీంతో వారంతా తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వం చుట్టూ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ధర్నాలు, రాస్తా రోకోలు, నిరాహార దీక్షలు సైతం చేస్తున్నా ఏ ప్రభుత్వం కరుణించడం లేదు.

## పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

తీన్మార్ న్యూస్ డెస్క్, మార్చి 05 (తీన్మార్ న్యూస్): రాష్ట్రపతి ద్రౌపది ముర్మును జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ మంగళవారం కలిశారు. పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు చాలా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తాజాగా వెలుగులోకి వచ్చిన సందేశ్‌కాలి హింసను వివరించారు. ఈ నేపథ్యంలోనే పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని ఆమె రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు. నేషనల్ కమిషన్ ఫర్ విమెన్‌తో పాటు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్, నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ వంటి పలు జాతీయ కమిషన్లు రాష్ట్రపతిని కలిశాయి. టీఎంసీ అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని విజ్ఞప్తి చేశాయి. అందుకే పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఎన్‌సీడబ్ల్యూ కోరింది అని ఆమె తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని ఈ ఘటన తన దృష్టికి వచ్చిందని రాష్ట్రపతి తెలిపారని రేఖా శర్మ వివరించారు. అక్కడి పరిస్థితులను తాను దగ్గరగా పరిశీలిస్తున్నట్టు చెప్పారని పేర్కొన్నారు.

## కేసీఆర్ తో భేటీఐన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

### ఇరువురి మధ్య రాజకీయ అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం



తెలంగాణ బ్యూరో, మార్చి 05 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసంలో కేసీఆర్‌ను ప్రవీణ్ కుమార్ కలిశారు. వీరిద్దరి మధ్య తాజా రాజకీయ అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఇదిలా ఉంటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మధ్య ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పుడు వీరిద్దరి మధ్య భేటీ జరగడం ఆసక్తిగా మారింది. అయితే వచ్చే పార్లమెట్ ఎన్నికల నేపథ్యంలో వీరి మధ్య జరగడం కూడా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, బాల్క సుమన్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ

**మొదటి పేజీ తరువాయి**

ఎంత కరెంటు కాలుస్తున్నాము? మీటర్ ఎంత తిరుగుతుంది అనేది చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన మండిపడ్డారు. 200 యూనిట్లు దాటితే 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి మిగతా యూనిట్ల ధరను వినియోగదారుడు చెల్లించే విధంగా బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలని హరీశ్ రావు విన్నవించుకున్నారు. ఇక, తెలంగాణ రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్లరేషన్ కార్డులుంటే ప్రభుత్వం కేవలం 30 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తుందని హరీశ్ రావు అన్నారు. మిగతా 60 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. హైదరాబాద్ నగరంలో కూడా 30 లక్షల మంది పేదలుంటే, కేవలం 10 లక్షల మందికే పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం మూడో వంతు పేదలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. రెండు వంతుల పేదలను విస్మరిస్తున్నారు. ఇది సరైంది కాదు అని ఆయన పేర్కొన్నారు. ఇక ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా కూడా విడిపోయి బతుకుతున్నారు అని హరీశ్ రావు వెల్లడించారు. ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో వేర్వేరు అంతస్తుల్లో ఉంటున్నారు. కానీ, ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్క కట్టి ఒక్కరికే పథకం వర్తింప చేస్తుంది అని హరీశ్ రావు అన్నారు. ఇది కూడా సరైన పద్ధతి కాదు. ఎన్ని కుటుంబాలుంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలి. నిజమైన పేదలకు న్యాయం చేయడమే మీ ప్రభుత్వ లక్ష్యమైతే. మొత్తం 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి కలిగేలా చేయాలి. అలా చేయని పక్షంలో ఈ పథకం కేవలం నామమాత్రంగానే మిగిలిపోతుందన్నారు. హామీల అమలుకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్లు అవుతుందనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాము. నిజంగా పేదలకు సాయం చేయాలనే చిత్తశుద్ధి మీకుంటే. వెంటనేపై మూడు విషయాల్లో తక్షణం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లో వివరాల నమోదుపై మండల ప్రత్యేక అధికారులు, ఎం పి డి లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రజాపాలన సాఫ్ట్ వేర్ ద్వారా లబ్దిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారెంటీ పథకాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదేవిధంగా మున్సిపాలిటీలలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేశామని, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. గృహ జ్యోతి క్రింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని దరఖాస్తు దారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా తప్పులను సవరించుకోవచ్చు అని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవల కేంద్రాలలో నూతన దరఖాస్తులను స్వీకరించడం లేదని ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మకూడదని అన్నారు. ప్రజలు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహ జ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్వేర్ పనితీరును క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణంగా వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆధార్ కార్డు/తెల్ల రేషన్ కార్డు వివరాల ద్వారా ప్రజా పాలన దరఖాస్తును గుర్తించాలని, అనంతరం తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్/విద్యుత్ మీటర్ నెంబర్ మ్యాచ్ ఐతే సదరు లబ్ధిదారులను గ్యారంటీ పథకాల క్రింద ఎంపిక చేసామని, వివరాలు మ్యాచ్ కాని పక్షంలో మరోసారి సరైన వివరాలు నమోదు చేయాలని అన్నారు. తెల్ల రేషన్ కార్డు వివరాలను ముందుగా వ్యాలిడేట్ చేయాలని, ముందస్తుగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారినిగా గుర్తించిన తర్వాత సదరు దరఖాస్తుదారులు అందించే గ్యాస్ కనెక్షన్ నెంబర్ వివరాలు, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు వ్యాలిడేట్ చేయాలని అన్నారు. ఈ వీడియో సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## కార్పొరేట్ విద్యకు కట్టడి ఎలా?

విద్యా సంస్థల ఫీజులు, డొనేషన్ల దోపిడీకి అంతు లేకుండా పోతున్నది. కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల కట్టడిపై ప్రభుత్వం మాట కూడా ఎత్తడం లేదు. దీంతో ఫీజులు మళ్లీ ఎలా పెంచుతారో అంటూ పేరెంట్స్ ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 10,700 వరకు కార్పొరేట్ ప్రైవేటు స్కూల్స్ ఉండగా, వీటిలో 32 లక్షల మంది చదువుతున్నారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కొంత తక్కువగానే ఉండగా మిగిలిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రం భారీగానే వసూలు చేస్తున్నారు. ఒక్కో స్కూల్లో క్లాసును బట్టి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు యాజమాన్యం ఫీజులు వసూలు చేస్తున్నది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు బడులు విద్యార్థుల చదువును సంతలో సరుకుగా మార్చేశాయి. స్కూళ్ళు ప్రారంభం కానున్నాయి, దోపిడీ మొదలైంది. అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లని, బుక్స్‌కు సపరేట్ అని, యూనిఫామ్‌కు సపరేట్ అని, ఐఐటి ఫౌండేషన్ అయితే సపరేట్, బస్సు ఫీజు సపరేటు అని ఇలా రకరకాల పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు పాఠశాలల యాజమాన్యాలు. తమ పిల్లలను ఉన్నతమైన, నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజులో పడి ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు అవకాశంగా మారింది. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు తెర తీశారు. పట్టణాల్లో చదవాలంటే హాస్టలు వసతి కూడా వారికి అవసరమవుతుంది. దీంతో స్కూలు, హాస్టల్ పేరుతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు, ఆ తర్వాత విద్యార్థులకు పాఠశాలను బట్టి రూ. 60 వేల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు తాము తక్కువ కాదంటూ కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఇదే సంప్రదాయానికి దిగాయి. సాధారణ చదువులతో ఐఐటి ఫౌండేషన్ అంటూ మరి కొంత నొక్కుతున్నాయి. దీంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్పించేందుకు వచ్చి, వెనక్కి వెళ్ళలేక చేర్పించే సాహసం చేయలేక తలిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. నేడు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ, దోపిడీ చేస్తూ అక్షరాలను వ్యాపారంగా కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా కార్పొరేట్, సెమీ కార్పొరేట్ తరహా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాల దోపిడీకి అడ్డుఅదుపు లేకుండాపోయింది. వీటిని నిరోధించాల్సిన అవసరం విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా నిబంధనలు పాతరవేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు చైతన్యమై ప్రభుత్వ నిబంధనలు, విద్యాహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిబంధనలు కనుక చూసినట్లయితే సెక్షన్- 6 ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ -11 ప్రైవేటు యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించే ఫీజు కంటే ఎక్కువ వసూలు చేయకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 1, 2 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీస్ బోర్డ్‌లో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్ -12 ప్రకారం టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20 కి మించరాదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమాన్యం 25% సీట్లను ఎస్సి, ఎస్టి, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. పాఠశాల యాజమాన్యాలు నోట్ బుక్స్, యూనిఫారాలు, స్కూల్ బ్యాగులు, ఇతర స్టేషనరీని అమ్మరాదు. ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా సూచించరాదు. డి.ఎడ్ లేదా బి.ఇడి అర్హత ఉండాలి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు డిఎడ్ లేదా బిఇడి అర్హత ఉండి టెట్‌లో అర్హత సాధించి ఉండాలి. విద్యార్థుల ఫీజు వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలి. జివో నెంబర్ 42 ప్రకారం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయరాదు. ఆట స్థలం తప్పనిసరిగా ఉండాలి. మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలల్లో 1000 చదరపు మీటర్లు. గ్రామీణ ఇతర ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. పాఠశాల పక్కా భవనంలో నిర్వహించాలి. ప్రతి పాఠశాలలో సలహాలు, సూచనలకు ఫిర్యాదు బాక్సులు ఉండాలి. ఫీజు స్లిప్పులను చిన్నారుల చేతికి రాసిఇస్తే జరిమానా ఉంటుంది. అభం శుభం తెలియని చిన్నారుల చేతికి స్కూల్ ఫీజుల రసీదులు ఇస్తున్నారు పాఠశాల యాజమాన్యం. మీ అమ్మనాన్న ఇంకా ఫీజు చెల్లించలేదంటూ వారిని కించపరుస్తున్నారు. గతంలో చిన్నారి చేతికి రసీదు ఇచ్చిన ఓ ప్రైవేట్ స్కూలుకు చెందిన యాజమాన్యానికి భారీ ఎత్తున జరిమానా విధించింది విద్యాశాఖ. అనుమతులు లేకుండా స్కూళ్లను ప్రారంభించకూడదు. ప్రభుత్వ అనుమతితోనే ప్రారంభించాలి. ఆరు నెలల్లోపు అనుమతులు పొందాలి. ప్రభుత్వ సూచనల ప్రకారం ఫీజులు తీసుకోవాలి. 20 మంది చిన్నారులకు ఒక ఉపాధ్యాయుడు, ఒక సంరక్షకుడు ఉండాలి. రక్షణ, భద్రతా, పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. భవనానికి ప్రహరీ ఉండి, గాలి వెలుతురు బాగా వచ్చేలా ఉండాలి. చిన్నారులు నిద్రపోవడానికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ఉండాలి. మరుగుదొడ్లు, స్నానాల గదిలో టవలు, సబ్బులు ఉంచి, పరిశుభ్రత చర్యలు పాటించాలి. ప్లే స్కూల్‌కు తప్పనిసరిగా ప్లే స్కూల్ అని బోర్డు పెట్టాలి. ప్రవేశాలు పూర్తయిన తర్వాత తల్లిదండ్రుల కమిటీని నెలలోపు నియమించాలి. ఇందులో 50% తల్లులు, 25% ఉపాధ్యాయులు, 25% తండ్రులు ఉండేలా చూడాలి. ఈ కమిటీని ఏటా మారుస్తుండాలి. ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను నమోదు చేయాలి. పిల్లలకు జంక్‌ఫుడ్‌ను అనుమతించకూడదు. పోషకాలతో కూడిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలి. ఇటువంటి నిబంధనలు చాలా స్కూళ్లు పాటించకుండా నడుపుతా ఉన్నాయి. కొన్ని స్కూళ్లలో ఎల్‌కెజికి రూ. 1,20,000 వసూలు చేస్తున్నారని పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగో తరగతికి రూ. 1,20,000 నుంచి రూ. 1,60,000కు పెంచారని చెబుతున్నారు. ఫీజులు ఇష్టం వచ్చినట్లు పెంచుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనికి కూడా ఒక ప్రత్యేక కమిటీని నియమించి, రాష్ట్ర ప్రభుత్వం పలానా తరగతికి ఫలానా అమౌంట్ తీసుకోవాలని సూచించాలి. ప్రైవేటు పాఠశాలలు ఫీజులు తీసుకోవాలి. అలా చేసినట్లయితే ప్రైవేటు పాఠశాల నుండి కొంత ఉపశమనం లభిస్తుందని పిల్లల తల్లిదండ్రులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫీజులను నియంత్రించే ఆలోచన చేయాలి.

# రాజకీయాలకి అతీతంగా అభివృద్ధి చేయాలి

### - జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్లా అయిలయ్య






భువనగిరి జిల్లా ప్రతినిధి, మార్చి 05(తీన్మార్ న్యూస్): రాజకీయ పార్టీలకతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం నాడు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జడ్పిటిసిలు, ఎంపిపిలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ అయినా ప్రజల సమస్యల పరిష్కారంలో కలిసి కృషి చేయాలని, గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. వేసవి వచ్చినందున త్రాగునీటికి అధిక ప్రాధాన్యతనివ్వాలని, ప్రజాప్రతినిధులు అధికారుల భాగస్వామ్యంతో నీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ నీళ్లు సక్రమ సరఫరా కావాలని మిషన్ భగీరథ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రతి నియోజక వర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పది కోట్లు మంజూరు చేసిందని, అందులో ముఖ్యంగా 2 కోట్లు త్రాగునీటికి కేటాయించడం జరిగిందని, గ్రామాలలో పైప్ లైన్లను పరిశీలించాలని, అవసరమైన చోట వెంటనే మరమ్మత్తులు పూర్తి చేయాలని, ఆలేరు, భువనగిరి, జనగాం 16 కిలో మీటర్ల పైప్ లైన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట బోర్లను లీజుకు తీసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో మండలాల వారిగా సంబంధిత శాఖలు సమావేశమై తీసుకోవాల్సిన చర్యలను రూపొందించుకొని క్షేత్రస్థాయిలో ఇబ్బందులను తొలగించాలని ఆదేశించారు. ట్యాంకులలో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను సంబంధిత ప్రజాప్రతినిధులకు అందచేయాలని, వారిని భాగస్వామ్యులను చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశిస్తూ గుండాల మండలంలో ప్రోటోకాల్ నిబంధనలను పాటించకపోవడం పట్ల తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని పంచాయితీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును ఆదేశించారు. ముఖ్యమైన





రోడ్ల పనులు పూర్తి చేయాలని, వర్షాలు వస్తే పనులు చేపట్టడం కుదరని అన్నారు. 18 కోట్లతో చేపట్టే వడపర్తి, మర్యాల, చీకటిమామిడి రోడ్ల పనులు సంబంధించి వారం రోజుల్లో టెండర్లు పనులు పూర్తవుతాయని, పనులు వెంటనే చేపడతామని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనం, ఆర్ డబ్ల్యు ఎస్., రోడ్లు భవనాలు, పంచాయితీరాజ్, ఎక్సైజ్, విద్యుత్ తదితర శాఖల అధికారులు జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. గ్రామాలలో, మండలాలలో అధికారులు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ప్రజల ఇబ్బందులు, సమస్యలు తొలగించేందుకు కృషి చేయాలని చైర్మన్ తెలిపారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలలో 5 గ్యారెంటీల పథకాలను అమలు చేయడం జరిగిందని, అలాగే రైతుబీమా, రైతుబంధు పథకాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అందరికీ లబ్దిచేకూరుస్తుందని, రైతులందరికీ రైతు భరోసా కల్పించడం జరుగుతుందని, మనకు పటిష్టమైన రాష్ట్ర ప్రభుత్వం ఉందని, అందరికీ మేలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీ నియోజక వర్గ అభివృద్ధి పనులకు 3 కోట్లు మాత్రమే ఇచ్చిందని, కానీ మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం పది కోట్లు మంజూరు చేసిందని, ఇందులో 2 కోట్లు త్రాగునీటికి వెచ్చించడం జరుగుతుందని, అవసరమైతే ఇంకొక కోటి వెచ్చిస్తామని, త్రాగునీటి ఇబ్బందులను క్షేత్రస్థాయిలో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులకు సూచించారు. రహీంఖాన్ పేట మోత్కూర్ రోడ్డును 3 నెలల్లో పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని రోడ్లు భవనాల శాఖ ఇంజనీరు శంకరయ్యకు సూచించారు. జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి క్రింద 500 వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి క్రింద 200 యూనిట్లు ఉచితం పథకాలకు సంబంధించి గత డిసెంబరు మాసంలో స్పెషల్ డ్రైవ్ పెట్టి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, వాటిని కంప్యూటరైజేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి మండల అభివృద్ధి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేస్తూ ఆధార్ కార్డు, గ్యాస్ కంపెనీ నెంబరు, రేషన్ కార్డు నెంబరు, ఎలక్ట్రిసిటీ సర్వీసు నెంబరు తదితర వివరాలు అందించని వారు కార్యాలయ పనివేళల్లో హెల్ప్ డెస్క్ లో కంప్యూటర్ ఆపరేటర్లకు అందించాలని, వారు వివరాలను పరిశీలించి తిరిగి సరిగా నమోదు చేస్తారని, స్పెషల్ డ్రైవ్ లో దరఖాస్తులు అందించని వారి కోసం దరఖాస్తు ఫారములు అందుబాటులో వుంచడం జరిగిందని, ప్రజాపాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ప్రతి నాలుగు నెలలకోసారి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పిటిసి, ఎంపిపి. సభ్యులు సమస్యలను తెలియచేస్తూ తీసుకోవాల్సిన సలహాలు అందించారు. రైతు బీమా పథకం గురించి తెలియని రైతులు చాలా మంది ఉన్నారని, ప్రతి ఒక్క రైతుకు రైతుబీమా పథకం గురించి తెలియచెప్పాలని, క్షేత్రస్థాయిలో ఎఈఓ.ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అర్హులైన ప్రతి రైతును రైతుబీమా పథకంలో నమోదు చేయాలని తెలిపారు. ఆర్.డబ్ల్యు.ఎస్. ద్వారా మంచినీటి సరఫరా సక్రమంగా జరగాలని, వేసవి దృష్ట్యా క్షేత్రస్థాయిలో పైప్ లైన్ల లీకేజీలను అరికట్టాలని, అవసరమైతే అదనపు బడ్జెట్ పొందాలని, గ్రామాలు, అర్బన్ ప్రాంతాలలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని తెలిపారు. పంచాయితీ రాజ్ రోడ్లను పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా చేయాలని, అక్రమ మద్యం, నాటు సారా తయారీని అరికట్టాలని, యువత చెడు మార్గం పట్టకుండా పటిష్ట నిఘాతో గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బికూ నాయక్, జిల్లా పరిషత్ సిఈఓ శోభారాణి, జడ్పిటిసిలు, ఎంపిపిలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# అనుమతి లేని హోర్డింగులు

## చోద్యం చూస్తున్న అధికారులు




యాచారం, మార్చి 05(తీన్మార్ న్యూస్): యాచారం మండలం, మాల్ గ్రామ పంచాయతీ పరిధి లో అక్రమ హోర్డింగులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి.

వీటికి సరైన అనుమతులు లేకున్నా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. హోర్డింగ్‌లు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేస్తున్నారా? లేదా అని అధికారులు పరిశీలించడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు గాలికి.. ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేసే సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలి. కానీ ఎక్కడా కానరావడం లేదు. విద్యుత్ వైర్లకు సమీపంలోనే భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఈదురు గాలులకు ఫ్లెక్సీలు చినిగిపోయి పక్కనే ఉన్న విద్యుత్ వైర్ల మీద పడటం తో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగె అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్ సమర్పిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సివిల్ ఇంజనీర్ పర్యవేక్షణలోనే భవనాలపై ఏర్పాటు చేయాలి. ప్లానింగ్ అధికారులు హోర్డింగ్‌లను పరిశీలించిన దాఖలాలు మచ్చుకు కనిపించడం లేదు.

# ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

### - వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్



ఆత్మకూర్, మార్చి 05(తీన్మార్ న్యూస్): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ వనపర్తి జిల్లా అమరచింత మండలం పరిధిలోని కొంకని వానిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ మాట్లాడుతూ గత ఏడాది చేసిన కూలీల డబ్బులు అకౌంట్ లాక్ కావడంతో డబ్బులు రాకుండా లేదని ఆరోపించారు. పని ప్రదేశంలో టెంటు సౌకర్యం లేదని, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న కూలీలు వెంటనే చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధికి కేవలం 66 వేల కోట్ల బడ్జెట్ కేటాయించడం అంటే ఉపాధిని నిర్వీర్యం చేయడంలో భాగమేనని విమర్శించారు. కొలతలతో నిమిత్తం లేకుండా రోజు కూలి 600 ఇవ్వాలని ఏడాదికి 200రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, మహేష్, మొగిలన్న, రాజు, అంజిలన్న, తదితరులు పాల్గొన్నారు.

# విస్తృతంగా వాహనాల తనిఖీ




## ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి

పెబ్బేరు, మార్చి 05(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండల కేంద్రంలో ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, బండి రికార్డు లేని వాహనాదారులకు జరిమానా విధించారు. ఈ చలాన్లు కట్టని వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా బండి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.

# సిసి రోడ్లు డ్రైనేజీ పనులు ప్రారంభం



నేరేడుచర్ల, మార్చి 05(తీన్మార్ న్యూస్): కెప్టెన్ నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నేరేడుచర్ల మండలం, దిర్శించేర్ల గ్రామంలో 25 లక్షలు రూపాయలతో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పనులను నేరేడుచర్ల జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య లు ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటసైదులు యాదవ్, మాగంటి జయమ్మ, జొన్నలగడ్డ చిన్నసైదులు, పడిగపాటి సైదిరెడ్డీ, జలిల్ కర్నే సైదిరెడ్డీ, గోపాలరెడ్డి, కుర్రి శ్రీను, నన్నేపంగ శ్రీను, బుర్రి శ్రీను, ఆర్కె, అంకుష్, సునీల్, తదితరుల పాల్గొన్నారు.

# అడుగంటిన భూగర్భ జలాలతో ఎండుతున్న వరి

**– పొట్ట దశలో జీవాలకు మేతగా మారిన పొలాలు**

రాజాపేట, మార్చి 05(తీన్మార్ న్యూస్): భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఈ దృశ్యాలు రాజపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో దర్శనమిస్తున్నాయి. వేసవి కంటే ముందే ఎండలు మండిపోవడం గత వర్షాకాలం సరైన వర్షాలు లేకపోవడం కారణంగా వారిపైర్లతోపాటు ఇతర పంటలు కూడా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





పంట పొలాలు ఎండిపోవడం అనే విషయం గత కొన్ని సంవత్సరాలుగా లేకపోగా తిరిగి ఆ పరిస్థితి రావడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా కూడా ఏ సమయంలో ఉంటుందో తెలియడం లేదని బాధిత రైతులు చెబుతున్నారు. రాజపేటకు చెందిన రైతు జెన్నే సిద్ధులు తనకు మూడెకరాలు ఉండగా మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తం ఐదు ఎకరాలలో 4 ఎకరాలు వరి పంటను సేద్యం చేయగా, అందులో ఒకటిన్నర ఎకరం వరి పంట ఎండిపోయిందని మరో రెండున్నర ఎకరాలు కోత దశకు వచ్చేసరికి ఏ విధంగా ఉంటుందోనని అనుమానం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం వరి పంట పొట్టదశకు చేరుకుందన్నారు. అదేవిధంగా మరికొందరు రైతులు రేగు రాములు అరా ఎకరం, కుమ్మరి లక్ష్మణ్ 2 1/2 ఎకరాలు, కుమ్మరి నాగరాజు రెండున్నర ఎకరాలు, కర్రే గణేష్ రెండెకరాలు వరి పంట ఎండిపోయిందని తెలిపారు. దీంతో వరి పంట జీవాలు మేపే విధంగా తయారైందని, తప్పని పరిస్థితుల్లో ఎండిన వరి పంటను జీవాలు మేపుతున్నట్లు బాధిత రైతులు చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడం విద్యుత్ సరఫరా అంతరాయంతో తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. వేల రూపాయల పెట్టుబడి ఆరుగాలం శ్రమించి ఇంటికి సిరులు కురిపించేందుకు పంట వస్తుందని భావించిన వరి పంట ఎండిపోవడంతో తాము అప్పుల పాలు కానున్నామని ఆశలు అడియాసలు కానున్నాయని రైతులు అన్నారు. ఈ విషయంపై విద్యుత్తు శాఖ ఏఈని వివరణ కోరగా ఉదయం 5 గంటల నుండి 9 గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా వ్యవసాయానికి నిలిపివేస్తున్నట్లు మిగిలిన పూర్తి సమయం విద్యుత్ సరఫరా కొనసాగుతుందని భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఈ సమస్య నెలకొంటుందని అన్నారు.




# భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్నం శ్రీనివాస్ నియామకం

యాదాద్రి ప్రతినిధి, మార్చి 05(తీన్మార్ న్యూస్): భువనగిరి పట్టణానికి చెందిన పట్నం శ్రీనివాస్ ని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన పట్నం శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కోసం విద్యార్థి దశ నుండి నుండి నేటి వరకు పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు కష్టపడుతూ ఏ ఎన్నికలలో అయినా బిజెపి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తూ పార్టీ ఎలాంటి కార్యక్రమాలు ఇచ్చిన ప్రతి ఒక్క కార్యక్రమంలో పాల్గొంటూ హిందూ ధర్మ సాధన కోసం కృషి చేస్తూ పార్టీ కష్టకాలంలో కూడా పార్టీకి అండగా ఉన్నటువంటి నన్ను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ కి బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కి ధన్యవాదాలు తెలుపుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు.



# పర్మిషన్ లేని పర్మిట్ రూమ్...




**– నిద్ర మత్తులో ఎక్సైజ్ శాఖ...**

**– ఎస్పీఆర్ సూపర్ మార్కెట్ లో నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్_ రూమ్**

**– ఊరికి మధ్యలో ఉన్న వైన్స్ ను తీసేవేయ్యాలని గ్రామస్థుల డిమాండ్**

రాజన్న సిరిసిల్లా ప్రతినిధి, మార్చి 05(తీన్మార్ న్యూస్): తంగళ్ల పల్లి మండలంలోని జిల్లాల్ల గ్రామంలో ఎలాంటి పర్మిషన్ లేకుండాహో ఎస్పీఆర్ సూపర్ మార్కెట్ లో మద్యం తాగుతు తరుచు గోడవలు చేస్తూ చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆరుబయట మల, మూత్ర విసర్జన చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇదేమిటని అడిగినవారిని సైతం ఇష్టానుసారంగా తిడుతు బెదిరిస్తున్నారనిహొగ్రామంలో ఎస్పీర్ సూపర్ మార్కెట్ అని బోర్డ్ పెట్టి అందులో తెరచాటున మద్యం సేవుస్తున్నరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ అంటూ ఎన్నో రకాల పథకాలు చేపట్టిన ఆరుబయట మాలమూత్ర విసర్జన చేయకూడదని పరిసరాలు పరిశుభ్రంగా వుండలని కానీ మందు బాబులు వికృత చేష్టలు చేస్తున్న పిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. గతం లో కూడా గ్రామం నడిబొడ్డు ఉన్న మద్యం దుకాణాన్ని తీసివేసి గ్రామ శివారులో ఏర్పాటు చెయ్యాలని ధర్నా చేసిన పట్టించుకోకుండా ఉన్నారని పాత వైన్స్ సమయం ముగిసిపోయి కొత్తగా మద్యంషాపును దక్కించుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మద్యం దుకాణం పర్మిషన్ రద్దు చేసి వేరే చోటుకి తరలించాలని అంటున్నారు లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.



# భువనగిరి పార్లమెంట్ టికెట్ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఇవ్వాలి

**– చిప్పలపల్లి మహేష్**



అడ్డగూడూరు, మార్చి 05(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంట్ టికెట్ రాష్ట్ర టిపిసిసి ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు చిప్పలపల్లి మహేష్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారంలో లేకపోయినా ప్రతి కార్యకర్తకి అండగా ఉంటూ ఎవరికి, ఏ కార్యకర్తకు ఆపద కలిగినా నేనున్నానంటూ తనదైన శైలిలో సహాయం చేసి కాంగ్రెస్ పార్టీ క్యాడరు కాపాడుతూ ప్రతి కార్యకర్త గుండెల్లో ముద్ర వేసుకున్న ఘనత చామల కిరణ్ కుమార్ రెడ్డిదని అలాంటివారికి పార్లమెంట్ టికెట్ ఇచ్చినట్లైయితే పార్లమెంటు నియోజకవర్గానికి న్యాయం జరుగుతుందని, అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్ని విధాలుగా ఆలోచించి సమర్థుడైన కిరణ్ కుమార్ రెడ్డికి అధిష్టానం టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న పరిస్థితులలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశీస్సులు నిండుగా ఉన్నాయి. అలాగే వారికి ఏడు నియోజకవర్గాలపై పట్టుండడం వారికి టిక్కెట్ ఇస్తే ముమ్మాటికి గెలవడం ఖాయమని అన్నారు.

# మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

**– అవిష్కరించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

రామన్నపేట, మార్చి 05(తీన్మార్ న్యూస్): మండలంలోని నిదానపల్లి గ్రామంలో మల్లన్న గుట్టపై వెలసి ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి (చిన్న శ్రీశైలం) బ్రహ్మోత్సవాలు భాగంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నివాసంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక మంగళవారం విడుదల చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకొని స్వామివారు నిదాన పల్లి నుండి మల్లన్న గుట్ట పైకి బయలుదేరుతారని, మరుసటి రోజు అనగా శనివారం రోజున రాత్రి 11 గంటలకు స్వామివారి కళ్యాణం జరుగుతుందని, ఆదివారం రాత్రి అనగా తెల్లవారితే సోమవారం రోజున 6 గంటల 30 నిమిషాలకు అగ్ని గుండాలు జరుగుతాయని, మల్లన్న గుట్ట ఉత్సవ కమిటీ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఏ నాగిరెడ్డిని, బేతోజు సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతి, ప్రతి సంవత్సరం శివరాత్రి పురస్కరించుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శశిదర్ దీక్షితులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ ముందడి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి, నాయకులు పున్న జగన్, పూస బాలకృష్ణ, గంగుల కృష్ణారెడ్డి, కొండ సంతోష్ కుమార్ గౌడ్, కొండ శీను గౌడ్, కట్టకూరి ప్రసాద్ గౌడ్, కడారి రాజశేఖర్, రాచకొండ యాదగిరి, కొండ శ్రీనివాస్ గౌడ్, కొండ నరేందర్ గౌడ్, గోగు రమేష్, కొండ కాటంరాజు, కొండ రాఘవేంద్ర, కొండ మహేష్, పబ్బతి చింటూ, బొడ్డుపల్లి మహేష్, కడారి వినయ్, బోవనగిరి నరేష్, సుర్వి రమేష్, కొండ సాయినాథ్, లొడంగి శశాంక్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు

చిట్యాల, మార్చి 05(తీన్మార్ న్యూస్): మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యా మందిర్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. 32 మంది విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, నాయకులుగా, ఉన్నతాధికారులుగా తమ పాత్రలను పోషించారు. ప్రత్యేక అలంకరణలో విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి పాఠశాల బాధ్యతలు నిర్వర్తించారు. నాయకులు, ఉన్నతాధికారులుగా పాత్రలకు తగినట్లుగా అనుకరించిన విధానం ముచ్చట గొలిపింది. ప్రిన్సిపాల్ గా రొండి చైతన్యశ్రీ, జిల్లా కలెక్టర్ గా బొమ్మగోని ప్రత్యూష, విద్యాశాఖ మంత్రిగా మామిడి క్రితిక్ష, జెడ్పి చైర్పర్సన్ గా బాగం మహాలక్ష్మి, జిల్లా విద్యాధికారిగా ఆవుల వంశీ, జిల్లా ఉపవిద్యాధికారిగా రొండి సబిత, మండల విద్యాధికారిగా రూపని ప్రసన్నలతో పాటు ఉపాధ్యాయులుగా ఆనంది, విన్ని, ఇందు, వర్షిత, విద్యశ్రీ, అలేఖ్య, శివమణి, మణికుమార్, శివసాయి, మల్లికార్జున్, విశ్వసాయి, జ్యోతి, శ్రీనాద్, సుప్రీత్, మత్స్యగిరి, శైబాజ్, రిశాకుమారి, రిషిక, నర్సింహా స్వామి, ప్రణీత్, శశికుమార్ లు వ్యవహరించారు. విద్యార్థులు తమలోని నాయకత్వ లక్షణాలు ప్రదర్శించడానికి చక్కని వేదికగా ఈకార్యక్రమాన్ని ఉపయోగించుకున్నారు. ఈకార్యక్రమాన్ని ఉపాధ్యాయ బృందం పర్యవేక్షించారు. విద్యార్థులు వారి అనుభవాలను పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పంచుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్, ప్రిన్సిపాల్ బొడిగె విజయ్ కుమార్ అభినందించి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వపరిపాలన దినోత్సవంలో ఏ వృత్తిని అయితే విద్యార్థులు నిర్వహించారో దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వస్తాయని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, బొడిగె రాణి, మునుకుంట్ల వేణు, ఈరమల్ల లూసిక, కోనేటి యాదగిరి, మునుకుంట్ల స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదానికి గురైన లోయపల్లి గ్రామపంచాయతీ కార్మికుడు రమేష్

**– కార్మికున్ని ప్రభుత్వం ఆదుకోవాలనీ సిఐటీయు నాయకులు పోచమోని కృష్ణ డిమాండ్**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 05(తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, లోయపల్లి గ్రామం లో గ్రామపంచాయతీ కార్మికుడు విధి నిర్వహణ ప్రమాదవశాత్తు విద్యుత్తు స్తంభము పై నుండి పడిన జిపి కార్మికుని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ పోచమ్మని కృష్ణ డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం లోయ పల్లి గ్రామంలో విధి లైట్లు వేస్తూ గ్రామపంచాయతీ కార్మికుడు పగిల, రమేష్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పై నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. మూడు రోజులపాటు ఇబ్రహీంపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్స కోసం రూ. 1.00000/- రూపాయలు దాకా ఖర్చులు అయ్యాయని అధికారులు మాత్రం ఎలాంటి ఆర్థిక సాయం చేయకుండా ఉండడంతో సిఐటియు తరపున అధికారులతో మాట్లాడటంతో నేడు తాత్కాలిక ఆర్థిక సాయం అందించారని కానీ అతని చికిత్సకు అయిన పూర్తి ఖర్చులు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుడు మూడు నాలుగు నెలలు రెస్ట్ తీసుకోవాలని డాక్టర్లు సూచించారని కావున ఈ మూడు నాలుగు నెలలు అతనికి వేతనాలు అందజేయాలని కోరారు. గ్రామపంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకొచ్చి ప్రతి ఒక్కరు అన్ని పనులు చేయాలని చెప్పడంతో రానటువంటి పనులను కూడా చేయించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.





ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ఐదారు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం నుంచి పడి గాయాల పాలయిన రమేష్ ను పరమార్శించిన తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శి రు. 15000/- ఆర్థిక సహాయం ఈరోజు మంచాల తాసిల్దారు ఎం వివి ప్రసాద్ రావు పంచాయతీ కార్యదర్శి శోభ గాయపడిన లోయపల్లి జి పి కార్మికుడు రమేష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. తాత్కాలిక సాయం కింద గ్రామ పంచాయతీ నుండి రూ. 10000/- నగదు పంచాయతీ కార్యదర్శి శోభ అందజేశారు. తహసీల్దార్ ఎం వి వి ప్రసాద్ రావు వ్యక్తిగతంగా రూ. 5000/- లతో బియ్యం నూనె ఇతర నిత్యాసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఊర చెరువు తూము ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**– విచారణ జరిపిన ఇరిగేషన్ ఏఈ, ఎస్ఐ**

పెబ్బేరు, మార్చి 05(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం, రంగాపురం గ్రామంలోని ఊర చెరువు, కుమ్మరికుంట తూము ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రంగాపురం గ్రామ ఆయకట్టు రైతులు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈకి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మిద్దె రాములు (విలేఖరి), అస్కని బాలరాజు, గుట్టమీది శేఖర్ మరికొంత మంది ఊర చెరువు, కుమ్మరికుంట తూములను అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ధ్వంసం చేశారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇట్టి విషయంపై విచారణ నిమిత్తం పెబ్బేరు ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డి ఇరిగేషన్ ఏఈ కిషోర్ విచారణ నిమిత్తం మంగళవారం రంగాపురం గ్రామంలో అట్టి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు ఇట్టి విషయంపై విచారణ చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.





# అంగన్వాని కేంద్రాలని బలోపేతం చేసి పౌష్టికాహారాన్ని అందించాలి

**- సీసీ కెమెరాలను పెట్టటం అంటే అంగన్వాడీలను అవమానపరచడమే**

**- సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు**

**- సిఐటియూ జిల్లా నాయకుడు యాకూబ్ డిమాండ్**






గరిడేపల్లి, మార్చి 05(తీన్మార్ న్యూస్): ఐసీడిఎస్ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కేవలం అంగన్వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు పెట్టడం వలన వచ్చే లాభం ఏమీ ఉండదని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. అంగన్వాని కేంద్రం ద్వారా పిల్లలకు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందించాలని సిఐటి యూ జిల్లా నాయకుడు యాకూబ్ మాట్లాడుతూ గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు సక్రమంగా పౌష్టికహారం పంపిణీ చేయటం లేదని, నెలకు సరిపోను ఫుడ్ ఇవ్వటం లేదని, కేంద్రాలలో బియ్యం, ఉంటే పప్పు ఉండదని, పాలు లేవని, గుడ్లు కూడా నాణ్యమైనవి పంపిణీ చేయటం లేదని, అంగన్వాడీలకు పక్కా భవనాలు లేవని, కనీసం చీపుర్లు కూడా ప్రభుత్వం సప్లై చేయటం లేదని, ప్రభుత్వం బడ్జెట్ పెంచకుండా అంగన్వాడీలను సీసీ కెమెరాల పేరుతో వారిని దొంగలు గా చిత్రీకరించడం సరి కాదని ఆయన అన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడీలను అనేక ఇబ్బందులకు గురి చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ప్రతి అంగన్వాడీ కోరుకున్నారని, గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా, ప్రభుత్వం హామీ ఇచ్చిన విదంగా వారి వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య వేశాల ఆంజనేయులు, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి తాళ్ల తిరపయ్య మరియు, సిఐటియూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ బకాయి నిధుల మంజూరి కోసం తాజా మాజీ సర్పంచ్ ల వినతి





రాజాపేట, మార్చి 05(తీన్మార్ న్యూస్): ప్రజావాణి ప్రగతిభవన్ లో మంగళవారం సర్పంచుల పెండింగ్ బిల్లుల విషయమై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని మరియు 15 కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ప్రగతి పవన్ నోడల్ అధికారి దివ్యలను కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి తో చర్చించి త్వరలో దశలవారీగా విడుదల చేస్తామని అధికార ప్రకటన ఇప్పిస్తామని సర్పంచులు ఎవరు ఆత్మహత్య చేసుకోవద్దని సూచించినారు. ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .రాష్ట్ర కమిటీ నుంచి సుర్వి యాదయ్య గౌడ్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుంటి మధుసూదన్ రెడ్డి, రాజారాం గౌడ్, ముధోల్, హరి నాయక్, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో దేశంలోకి రష్యా క్రూడాయిల్!

బెంగళూరు: రష్యా నుంచి మన దేశానికి క్రూడాయిల్ దిగుమతులు అంతకంతకూ పెరుగుతున్నాయి. తక్కువ ధరకే లభిస్తుండడంతో భారత్ భారీ స్థాయిలో ముడి చమురును కొనుగోలు చేస్తోంది. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి కొనసాగుతుండగా.. జనవరి నెలలో ఎప్పుడూ లేని స్థాయికి చేరింది. ఒకప్పుడు ఒక శాతం కూడా లేని దిగుమతులు ఇప్పుడు ఏకంగా 28శాతానికి చేరినట్లు ఎనర్జీ కార్గో ట్రాకకర్ వొర్టెక్సా వెల్లడించింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు ముందు రష్యా నుంచి మన క్రూడాయిల్ దిగుమతులు కేవలం 0.2 శాతం మాత్రమే. ఉక్రెయిన్‌పై దాడి తర్వాత పశ్చిమ దేశాలు ఆ దేశంపై ఆంక్షలు విధించాయి. దీంతో ఆదాయం కోసం ముడి చమురును డిస్కౌంట్ ధరకే ఆ దేశం అందిస్తోంది. దీంతో చైనా, భారత్ ఆ దేశం నుంచి తక్కువ ధరకే క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో రష్యా ముడి చమురు వాటా 28 శాతానికి చేరింది. డిసెంబర్‌లో ఈ వాటా 26 శాతంగా ఉంది. రష్యా తర్వాత ఇరాక్ (20 శాతం), సౌదీ అరేబియా (17 శాతం), అమెరికా (9 శాతం), యూఏఈ (8 శాతం) అత్యధికంగా మన దేశానికి క్రూడాయిల్‌ను ఎగుమతి చేస్తున్నాయి. దేశీయ అవసరాలు తీర్చుకోవడానికి ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమానికి హాజరైన అధికారులు తెలిపారు.

## దుబాయి కరెన్సీ మార్పిడి పేరుతో మోసం



జడ్చర్ల: దుబాయి కరెన్సీ మార్చుకుని లాభపడాలనుకున్న దంపతులను గుర్తు తెలియని వ్యక్తి నిలువునా ముంచాడు. వారి నుంచి రూ.5 లక్షలు తీసుకుని ఉడాయించిన ఘటన ఆదివారం జడ్చర్లలో జరిగింది. సీఐ రమేశ్‌బాబు, ఎస్సై లెనిన్ కథనం మేరకు వివరాలు.. మహబూబ్‌నగర్‌లోని మదీన మసీదు సమీపంలో నివాసం ఉంటున్న సిరాజుద్దీన్ ఆప్టికల్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈయనకు వద్దకు వారం రోజుల క్రితం గుర్తు తెలియని ఓ వ్యక్తి వచ్చి తన వద్ద దుబాయ్ కరెన్సీ (దిర్‌హమ్) ఉందని, వాటిని తీసుకుని ఇండియన్ కరెన్సీ ఇవ్వాలని కోరాడు. కరోనా సమయంలో తన వద్ద దిర్‌హమ్స్ ఉండిపోయిందని చెప్పుకొచ్చాడు. తన వద్ద ఉన్న దిర్‌హమ్స్‌ను చూపించాడు. ఇండియన్ రూపాయి విలువ ప్రకారం సుమారు 35 లక్షల వరకు ఉంటుందని, వాటిని తీసుకొని రూ.10 లక్షలు ఇవ్వాలని కోరాడు. జడ్చర్లలోని రైల్వేగేటు సమీపంలో గ్రంథాలయం వద్దకు రావాలని సిరాజుద్దీన్, ఆయన భార్య యాస్మిన్‌ను సూచించాడు. అక్కడికి ఎందుకు రావాలని వారు ప్రశ్నించడంతో దిర్‌హమ్స్ అక్కడే ఉన్నాయని తప్పుదోవ పట్టించాడు. అత్యాశకు పోయిన వారు ఆదివారం జడ్చర్లకు చేరుకుని రూ.5 లక్షలు దుండగుడికి ఇచ్చారు. అతను దుబాయి కరెన్సీ ఉందని ఓ సంచి ఇచ్చాడు. వారు సంచి తెరచి చూడగా అందులో కాగితాలు కనిపించాయి. దుండగుడిని పట్టుకునేందుకు యత్నించగా అతను మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రమేశ్‌బాబు, ఎస్సై లెనిన్ బృందం ఘటనా స్థలాన్ని చేరుకొని విచారణ చేశారు

## రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలకు విద్య, వైద్యం అందేలా చూడాలి..

**- రూ.37 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ ప్రారంభం: ఎమ్ ఎల్ సి ప్రభాకర్ రావు**



సుల్తాన్ బజార్ : రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలకు విద్య, వైద్యం అందేలా చూడాల్సిన భాధ్యత ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధిపై ఉందని ఎమ్ ఎల్ సి ఎం.ఎస్ ప్రభాకర్ రావు అన్నారు. సోమవారం కోఠిలోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఎం ఎల్ సి ప్రభాకర్ రావు సీడీపీ కోటాలో 37 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన నూతన వీడీసీసీ రోడ్డును ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ భీష్వ, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కె రాజ్యలక్ష్మి, నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి సీహెచ్ ఆనందకుమార్ గౌడ్, దిలీప్, మనోహర్ బాబులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రభుత్వ ప్రసూతి దవాఖానాకు పేద గర్భిణీలు అత్యధిక సంఖ్యలో వస్తున్న తరుణంలో ఈ దవాఖానాలో వసతుల కల్పన కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆర్ ఎం ఓ సీహెచ్ ప్రభాకర్ లవిన్నపం మేరకు ఎం ఎల్ సి కోటాలో సీడీపీ నిధుల నుండి 37 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. తాను గత 14 ఏళ్ళుగా ఎంఎ ల్ సి గా కొనసాగుతున్నానని అన్నారు. పేద ప్రజలు అత్యధికంగా విచ్చేసే ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ దవాఖానాలలో మంచి నీటి ఆర్వో ప్లాంట్లను, సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎం ఎన్ జే క్యాన్సర్, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, సుల్తాన్ బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన, నిజాం కళాశాల తదితర ప్రాంతాలలో ఆర్వో ప్లాంట్లను, సీసీ రోడ్డు నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేయడం తనకెంతో సంతోషాన్నిస్తుందని అన్నారు. ఇదిలా ఉండగా సుల్తాన్బజార్ ప్ర ప్రభుత్వ ప్రసూతి దవాఖానాలో ఎస్ఎన్సీయూ వార్డు నుండి లేబర్ రూం వార్డుకు వెళ్ళేందుకు పూర్తిగా తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని, ఈ ప్రాంతంలో ఒక ర్యాంప్ షెడ్ వేయడంతో ఇబ్బందులు తొలగిపోతాయని తెలపారని వివరించారు. త్వరతి గతిన సీడీపీ నిధుల నుండి పనులు పూర్త య్యేలా చూడాలని ఈఈకి తగిన సూచనలను చేశారు. తదనంతరం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి నూతనంగా నిర్మించిన రోడ్డును పర్యవేక్షించారు. రోడ్డు కొంత భాగం మిగిలి ఉన్న ప్రాంతాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దవాఖానాలో పేద గర్భిణులకు ఎంతో మెరుగైన సేవలను అందిస్తున్న దవాఖానా సూపరింటెండెంట్, వైద్య సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దవాఖానా సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి , ఆర్ఎంఓ డాక్టర్ సీహెచ్ ప్రభాకర్, ఆర్డీవో మైపాల్ రెడ్డి,నాంపల్లి మండల తహసిల్దార్ ప్రేమ్ కుమార్, స్పెషల్ ఆర్ఐ అశ్విన్, వీఆర్ఓ నరసింహారెడ్డి,ఈ ఈ గురుప్రసాద్, నర్సింగ్ సూపర్డెంట్ సుజాత, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, నర్సింగ్ ఆఫీసర్ లు మంజుల, స్వప్న సందేశిని, బాలరాజ్, విజయ్ కుమార్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## మసీదుల వద్ద సౌకర్యాలను కల్పించాలి..

**- మున్సిపల్ ఛైర్ పర్సన్, కమిషనర్ కు కోరిన పట్టణ ముస్లిం కమిటీ**



వేములవాడ: ఈనెల 12 నుండి ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ మున్సిపల్ పరిధిలోని అన్ని మసీదుల వద్ద తగు సౌకర్యాలను కల్పించాలని పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని మసీదుల వద్ద చలువ పందిళ్ళు,హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, రంజాన్ మాసంలో 24 గంటలు నీటి సరఫరాచేయాలని, కోతలు లేకుండా విద్యుత్తు , ముస్లిం స్మశానవాటికలో,ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన చైర్ పర్సన్, కమిషనర్ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మున్సిపల్ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని పట్టణ ముస్లిం కమిటీ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అక్రం,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బాబున్,ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ వలి, మాజీ అధ్యక్షులు అంజద్ పాషా,మసీద్ అధ్యక్షులు షేక్ ఇమామ్, సర్వర్ పాష,అబ్దుల్ రజాక్, మహమ్మద్ బషీర్, అబ్దుల్ రఫీక్,ముస్లిం నాయకులు షేక్ యూసుఫ్, రహీం, కమిటీ సభ్యులు మతపెద్దలు పాల్గొన్నారు.

## ఇంటి బోర్లకు మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలి

**- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్**

**- కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు ధర్నా**

కంటోన్మెంట్: ఇండ్లల్లో బోర్లకు నీటి మీటర్లు బిగించే ప్రతిపాదనలను విరవించుకోవాలని సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
ఇండ్లల్లో వేసుకున్న బోర్లకు మీటర్ బిగించే పద్ధతి ఎక్కడా లేదన్నారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు మీటర్లు బిగించే ప్రతిపాదన తెచ్చి ప్రజలను ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బోర్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ(ఎం) నగర కార్యవర్గ నాయకులు కేఎన్ రాజన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహేందర్, అజరు బాబు, ఆర్.మల్లేష్, అశోక్, ఆర్.వెంకటేష్ సుదర్శన్, సత్యనారాయణ, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజు, ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

## మహిళ అధ్యక్షురాలుగా నాటం కామాక్షి ఎన్నిక



జవహర్ నగర్, మార్చి 05(తీన్మార్ న్యూస్): జవహర్నగర్ కార్పొరేషన్లోని 15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నాటం కామాక్షి ఎన్నికయ్యారు. మంగళవారం కార్పొరేషన్లోని 15వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహిళా కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షురాలిగా ఎన్నికైన నాటం కామాక్షికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీఠ వేస్తుందని అన్నారు. ఉపాధ్యక్షులుగా జపాల నవనీత, మార్కుల సుకన్య, ప్రధాన కార్యదర్శిగా సింధు, కమిటీ సభ్యులు రేణుక, శ్యామల, సుష్మ, లావణ్య, అనసూయ, విజయలక్ష్మి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అనంతలక్ష్మి, గండి సునీత, రజితాగోపాల్, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజా సమస్యలు పట్టించుకోండి



**- పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కి వినతిపత్రం**

ఆత్మకూర్, మార్చి 05(తీన్మార్ న్యూస్): సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా అమరచింత మండలం కొంకనోని పల్లి గ్రామంలో ప్రజా సమస్యలపై పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు బి.వెంకటేష్, అజయ్, గ్రామ కార్యదర్శి డి మహేష్ మాట్లాడుతూ గ్రామంలో వేసవికాలం ప్రారంభం అయినచో మంచినీళ్లు సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయం చూడాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో వీధిలైట్లు డ్రైనేజీలు సిసి రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గ్రామంలో దోమల బెడద నుండి కాపాడాలని బ్లీచింగ్ పౌడర్ ను వేయాలని అదేవిధంగా గ్రామ పంచాయతీ ఆఫీస్ ముందు ఉన్న ఐమాక్స్లైట్లను రిపేర్ చేసి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మొగిలి అన్న వెంకటేష్, శ్రీకాంత్, రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు




మోత్కూరు,: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) సుమన్ అన్నారు. మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో బిక్కేరు వాగు వెంట ఆక్రమణకు గురైన తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఐ సుమన్ పరిశీలించారు. సుమారు రూ.4 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలోని చెట్లను కొందరు వ్య క్తులు అక్రమంగా నరికివేసి, భూమి చదును చేసి, ఆక్రమించుకుని పొలం చేసి ఇటీవల వరినాటు వేస్తుండగా కొందరు స్థానికులు అడ్డుకుని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఆ భూమి ఆక్రమించగా అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు అది ప్రభుత్వ భూమి అని, అందులోకి ఎవరూ వెళ్లవద్దని బోర్డుకూడా పెట్టారు. ప్రభుత్వ బోర్డును తొలగించి తిరిగి ఆక్రమణలకు పాల్పడటంతో ఆ భూమిని ఆర్ఐ సుమన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ ద్వారా కలెక్టర్‌కు నివేదిక పంపి, రెవెన్యూ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామ న్నారు. మాల మహానాడు జిల్లా ప్రధానకార్యదర్శి బోడ బాబూరావు, పేదలు గుంటి ఆనందం, అచ్చయ్య, చిట్టిమాల దేవయ్య, గుంటి నర్సయ్య, నర్సింహాచారి ఆయన వెంట ఉన్నారు.

# అఫిలియేషన్ల విషయంలో ఆధిపత్యపోరు.. తనిఖీలు చేస్తామన్న జేఎన్టీయూ.. వద్దంటున్న కాలేజీలు

హైదరాబాద్, మార్చి 5: ఇంజినీరింగ్ సహా ప్రొఫెషనల్ కాలేజీలకు అఫిలియేషన్ల జారీ విషయంలో ఆధిపత్యపోరు నడుస్తున్నది. జేఎన్టీయూ వర్సెస్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజెస్ అన్నట్టుగా తయారయ్యింది వ్యవహారం. 2024-25 విద్యాసంవత్సరానికి జేఎన్టీయూహెచ్ అనుబంధ గుర్తింపు కోసం 220 కాలేజీలు దరఖాస్తులు సమర్పించాయి. వీటిలో ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ కాలేజీలున్నాయి. నిబంధనల ప్రకారం జేఎన్టీయూ నియమించిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (ఎఫ్ఎఫ్సీ)లు ఈ కాలేజీల్లో ప్రత్యక్ష తనిఖీలు నిర్వహిస్తాయి. జేఎన్టీహెచ్ 18 బృందాలను నియమించగా.. ఇవి కాలేజీల్లో తనిఖీలు చేసి ఇచ్చిన నివేదిక ఆధారంగానే జేఎన్టీయూహెచ్ అనుబంధ గుర్తింపును జారీచేస్తుంది. మార్చి మొదటి వారం నుంచి తనిఖీలు చేపడతామని జేఎన్టీయూ ప్రకటించిన షెడ్యూల్‌ను కాలేజీల యాజమాన్యాలు వ్యతిరేకిస్తున్నాయి. ముందుస్తు తనిఖీలేంటని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. దీంతో తనిఖీలు నిలిచిపోయాయి.

కాలేజీ వర్గాల వాదనలు ఇలా..

జేఎన్టీయూ వీసీ పదవీ కాలం మే నెలలో పూర్తికానున్నది. కొత్త వీసీ వచ్చినప్పుడే తనిఖీలు చేపట్టవచ్చు కదా! చాలా కాలేజీలు కోర్సుల విలీనానికి..సీట్ల పెంపునకు దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా ఏఐసీటీఈ అనుమతులు, సీట్లను ఖరారు చేయలేదు.

అలాంటప్పుడు తనిఖీలు చేసి ప్రయోజనమేంటి?



ఫ్యాకల్టీ అసోసియేషన్ వాదనలు ఇవీ..

వాస్తవానికి కొత్త సీట్లు కేటాయించిన తర్వాతే జేఎన్టీయూహెచ్ తనిఖీలు చేపట్టాలి. ఇప్పటికే కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరత ఉంది._ ఉద్యోగుల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జేఎన్టీయూ చర్యలను ఖండిస్తున్నాం.

జేఎన్టీయూ వర్గాల వాదనలు..

ఏఐసీటీఈ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జనవరి 31తోనే ముగిసింది. గతంలో ఏప్రిల్ 15 తర్వాత ముగిసింది. ఈసారి దరఖాస్తుల స్వీకరణ ముందుగానే ముగియడంతో తనిఖీలను ముందుగానే చేపట్టాం. సీటీఈ ప్రకటించిన షెడ్యూల్‌ను అనుసరించే తనిఖీలు మొదలుపెట్టాం. ప్రస్తుతానికి తనిఖీలు నిలిపివేయమని ఆదేశాలొచ్చాయి. వాటిని పాటిస్తున్నాం.

# ఉద్యోగులకు శుభవార్త.. భారీగా పెరగనున్న వేతనాలు

ఉద్యోగులకు భారీ శుభవార్త.. త్వరలోనే వారి వేతనాలు భారీగా పెరగనున్నాయి. ఎందుకంటే.. ప్రభుత్వం వారికి అందించే డీఏ, హెచ్ఆర్ఏ, గ్రాట్యుటీ, అలవెన్సులను భారీగా పెంచనుంది. దీని వల్ల ఉద్యోగుల జీతాలు ఎక్కువ మొత్తంలో పెరగనున్నాయి. అయితే ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే. వారు ఇప్పటికే ఎంతోకాలం నుంచి డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) పెంపు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలే.. లెబర్ బ్యూరో విడుదల చేసిన కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రీయల్ వర్కర్స్ (సీపీఐ-డబ్ల్యూ) భారీగా పెరిగిన నేపథ్యంలో.. ఈసారి డీఏ పెంపు మరో 4 శాతం ఉంటుందని అధికారులు అంచానా వేస్తున్నారు. దీని వల్ల ఉద్యోగులు పొందే డీఏ 50 శాతానికి చేరనుంది. ఇక 4 శాతం డీఏ పెంపుతో ఉద్యోగుల జీతాలు భారీగా పెరగనున్నాయి. అలాగే డీఏ 50 శాతానికి పెరగడంతో.. ఇతర అలవెన్సులు కూడా భారీగానే ఉండనున్నాయి. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు భారీగా పెరగున్నాయి. ఇప్పటికే డీఏ పెంపు, హెచ్ఆర్ఏ, గ్రాట్యుటీ వంటి అలవెన్సులకు సంబంధించి 7 వ వేతన సంఘం నిబంధనలు రూపొందించింది. డీఏ 50 శాతానికి పెరిగితే అది శాలరీపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందని లెక్కలతో సహా వెల్లడించింది.

ఇక ఉద్యోగులకు ఇచ్చే డీఏ 50 శాతానికి పెరిగినప్పుడు ఇతర అలవెన్సులు అనగా.. హెచ్ఆర్ఏ, పిల్లల విద్యా అలవెన్సులు, డైలీ అలవెన్సులు, హాస్టల్ సబ్సిడీ, ట్రాన్స్‌ఫర్ పై టీఏ, గ్రాట్యుటీ సీలింగ్, డ్రెస్ అలవెన్స్, సొంత రవాణా కోసం మైలేజ్ అలవెన్సులు వంటివి భారీగా పెరుగుతాయి. అంతేకాక ఉద్యోగులు ఏ ప్రాంతంలో



నివసిస్తున్నారు అనే దానిపై వారికి కేటాయించే హౌస్ రెంట్ అలవెన్స్ ఆధారపడి ఉంటుంది. ఇక 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు.. హెచ్ఆర్ఏ ప్రాంతాల వారీగా భిన్నంగా ఉంది. క్లాస్ ఎక్స్ సిటీలో హెచ్ఆర్ఏ 24 శాంతం ఉండగా.. క్లాస్ వై సీటీలో 16 శాంతం, క్లాస్ జెడ్ సిటీలో 8 శాతంగా ఉంది. అయితే ఇప్పుడు డీఏ పెంపు ఉండటంతో.. వీటిని 30, 20, 10 శాతానికి పెంచాలని భావిస్తున్నారు. ఇక 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు డీఏ 50 శాతానికి చేరిన ప్రతిసారి పిల్లల చదువుకు సంబంధించిన అలవెన్స్ కూడా 25 శాతం పెరగాలి. అదే విధంగా పిల్లల సంరక్షణ కోసం స్పెషల్ అలవెన్సులు, గ్రాట్యూటీ సీలింగ్, డ్రెస్ అలవెన్స్‌లు, డైలీ అలవెన్స్‌లు సైతం 25 శాతం మేర పెరిగే అవకాశంది ఉంది అంటున్నారు. దీని వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు భారీగా పెరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే దీనికి సంబంధించి కేంద్ర నుంచి అధికారక ప్రకటన రావాల్సి ఉంది.

# భారత బలగాలకు మాల్దీవుల అధ్యక్షుడి అల్టిమేటం

మాలె: మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు మరోసారి భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కాడు. మే 10 తర్వాత భారత్‌కు చెందిన ఓ ఒక్క మిలిటరీ సిబ్బంది తమ దేశంలో ఉండకూదని తెలిపారు. కనీసం సివిల్ డ్రెస్సుల్లో కూడా తమ భూభాగంలో తిరగడానికి వీలు లేదంటూ మంగళవారం పేర్కొన్నారు. సైనిక సహకారంపై చైనాతో మాల్దీవులు కీలక ఒప్పందం కుదుర్చుకున్న గంటల వ్యవధిలోనే ముయిజ్జు ఈ తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం

'భారత సైన్యం ఉపసంహరణలో మా ప్రభుత్వం విజయం సాధించింది. కానీ దీనిని చూసి తట్టుకోలేని కొంతమంది (విపక్షాలు) తప్పుడు విషయాలను వ్యాప్తిచేస్తున్నారు. కొత్త ట్విస్ట్‌లు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇండియన్ మిలిటరీ ఇక్కడి నుంచి వెళ్లడం లేదని.. వారు తమ యూనిఫామ్‌లను పౌర దుస్తులుగా మార్చుకొని మళ్లీ తిరిగి వస్తున్నారని ఆరోపిస్తున్నారు. కానీ అలాంటి అనుమానాలేం పెట్టుకోవద్దు. మే 10 తర్వాత భారత బలగాలు మాల్దీవుల్లో ఉండవు. యూనిఫామ్‌లో అయినా లేదా సివిల్ దుస్తుల్లోనూ ఎవరిని ఉండనివ్వం' అని స్పష్టం చేశారు. మాల్దీవులలోని మూడు వైమానిక స్థావరాల్లో ఒకదానిలో విధులు నిర్వర్తిస్తున్న భారత సైనిక సిబ్బందిని మార్చి 10లోగా మిగతా రెండు స్థావరలాల్లోని బలగాలను మే 10 నాటికి వెనక్కి వెళ్లిపోవాలని మాల్దీవులు విదేశాంగమంత్రిత్వ శాఖ తెలిపింది. దీనిపై ఢిల్లీలో ఫిబ్రవరి 2న ఇరు దేశాల ప్రతినిధులు



సమావేశమయ్యారు. తమ బలగాల స్థానంలో సమర్థులైన సాంకేతిక సిబ్బందిని నియమించేందుకు భారత్ పెట్టిన షరతును మాల్దీవులు అంగీకరించింది. దీంతో గతవారమే మాల్దీవుల్లో బాధ్యతలు స్వీకరించడానికి భారత సాంకేతిక బృందం అక్కడికి చేరుకుంది కాగా మాల్దీవుల్లో మూడు వైమానిక స్థావరాల్లో 88 మంది భారత మిలిటరీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు రెండు హెలికాప్టర్లు ఒక డోర్నియర్ విమానాల ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా మాల్దీవుల ప్రజలకు మానవతా సాయం, వైద్యం కోసం తరలింపు వంటి సేవలను అందిస్తున్నారు. అయితే ముయిజ్జు గత సంవత్సరం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌పై వ్యతిరేక వైఖరిని అవలంభిస్తున్నారు.

# రంజాన్ మాసం ఎప్పుడు ప్రారంభమవుతుంది?


రంజాన్‌ను 'రమదాన్' అని పిలుస్తారు. అలాగే 'ఈద్ ఉల్ ఫిత్ర' అని కూడా అంటారు. ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటారు. దానధర్మాలు చేస్తారు. పండుగ అనేది ఏ మతానికి, కులానికి సంబంధించినది అయినా కావచ్చు, దాని వెనుక అద్భుతమైన సందేశం ఉంటుంది. అలాగే రంజాన్ పండుగ వెనుక కూడా మానవాళికి మంచి చేసే ఉద్దేశం ఉంది. ఇది క్రమశిక్షణను, దాతృత్వాన్ని, ధార్మిక చింతనను ప్రజలకు బోధిస్తుంది. ముస్లింల మత గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని చెప్పుకుంటారు. అందుకే ఈ మాసం ముస్లింలకు అత్యంత పవిత్ర మాసం.

ఉపవాసాన్ని ఏమంటారు?

ఖురాన్ లో చెప్పిన ప్రకారం ఈ రమదాన్ నెలలో ఖచ్చితంగా ప్రతిరోజు ఉపవాసం ఉండాలి. దీన్ని 'రోజా' అని పిలుస్తారు. మన దేశంలోని ముస్లిం సోదరులు రాత్రి నిద్రపోయి, తెల్లవారిజామున నాలుగు గంటలకు లేచి 'సహరి' చేస్తారు. సహరి అంటే భోజనం. ఆ తర్వాత రోజంతా ఉపవాసం ఉంటారు. సాయంత్రం సూర్యాస్తమయం అయ్యాక ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. రమదాన్ నెలలో బయట ఏవీ తినకూడదని, తాగకూడదనే ఆచారం ఉంది. అందుకే ఈ నెలంతా ముస్లిం సోదరులు ఇంట్లోనే వండుకొని తింటారు.

జకాత్

రమదాన్ నెలలో చెప్పుకోవలసిన మరొక విశేషం 'జకాత్'. అంటే దానధర్మాలు చేయడం. రంజాన్ నెలలో జకాత్ చేయాలని ఖురాన్ చెబుతోంది. సంపాదించిన దాంట్లో కొంత పేదలకు దానం చేయాలన్నది జకాత్ నిర్వచనం. ఇది పేదవారికి ఆర్థిక హక్కుగా కూడా చెప్పుకుంటారు. ప్రతి ధనకుడు ఇలా తన సంపాదనలో 30% పేదలకు దానంగా ఇవ్వాలని జకాత్ చెబుతోంది. దీనివల్ల ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగను నిర్వహించకుంటారన్నది ఖురాన్ సారాంశం.



రమదాన్ నెల... నెలవంక పొడిచాక ముగుస్తుంది. ఆ చివరి దినాన్ని ఈద్-ఉల్-ఫితర్ పండుగగా నిర్వహించుకుంటారు. ఆరోజు అందరూ కొత్త బట్టలతో అత్తరు చల్లుకొని ఆనందంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈద్ ముబారక్ అని విషెస్ చెప్పకుంటారు.

రంజాన్ ఎప్పుడు మొదలవుతుంది?

రంజాన్ ఇస్లామిక్ చంద్రమాన క్యాలెండర్ లో తొమ్మిదవ నెలలో మొదలవుతుంది. రంజాన్ ప్రతి సంవత్సరం మారుతూ ఉంటుంది. ఈ ఏడాది మన దేశంలో రంజాన్ మార్చి 11 లేదా మార్చి 12న మొదలవుతుంది. మక్కాలో చంద్రుని దర్శనంపై రంజాన్ ఆధారపడి ఉంటుంది. నెలవంక ఆకారంలో చంద్రుడు మొదట సౌదీ అరేబియాలో దర్శనమిస్తాడు. తరువాత భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో కనిపిస్తాడు. అలా నెలవంక కనిపించాక రంజాన్ మొదలైనట్టే.

ఇఫ్తార్ ఎప్పుడు?

ప్రతిరోజూ ఇఫ్తార్ సమయాలు సూర్యాస్తమయం మీద ఆధారపడి ఉంటాయి. ప్రతిరోజూ ఏ సమయంలో సూర్యాస్తమయం అవుతుందో ...అప్పుడు ఇఫ్తార్ నిర్వహించుకుంటారు. కాబట్టి ప్రతిరోజు ఇదే సమయానికి ఇఫ్తార్ అని చెప్పడానికి వీలు లేదు.

# సమస్యల కంటే అంబానీ వివాహ వేడుకకే ప్రాధాన్యం

భోపాల్ : శతకోటీశ్వరుడు ముకేష్ అంబానీ ఇంట జరిగే వివాహ వేడుకను చూపించడానికి దేశంలో ప్రధాన మీడియా స్రవంతికి సమయం ఉంది కానీ రైతుల ఆందోళన, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను చూపించ డానికి సమయం లేదని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో సోమవారం జరిగిన భారత్ జోడో న్యారు యాత్రలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం దేశంలో అతి పెద్ద సమస్యలు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి. అయితే మీడియా ఎందుకు రోజంతా అంబానీ వివాహం గురించే చర్చి స్తోంది. ఎవరైనా నాకు వివరించండి' అని రాహుల్ అన్నారు. 'మీరు టీవి చూసి నప్పుడు మీకు బాలీవుడ్ నటులు, కొన్నిసార్లు క్రికెటర్లు కనిపిస్తారు. మీడియాపై మీకు నియంత్రణ లేని కారణంగానే మీ సమస్యలు గురించి మాట్లాడరు' అని చెప్పారు. దేశంలోని ప్రధాన మీడియా స్రవంతి అంతా బడా పారిశ్రామికవేత్తల చేతిలోనే ఉందని విమర్శించారు. సోమవారం శివపురి నుంచి



ప్రారంభమైన ఈ యాత్ర తరువాత ప్రస్తుత కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రాబల్యం ఉన్న గుణ నియోజవర్గం మీదుగా సాగింది. 2019 లోక్‌సభ ఎన్నికల వరకూ కాంగ్రెస్‌లోనే ఉన్న జ్యోతిరాదిత్య సింధియా 2020 మార్చిలో బిజెపిలో చేరారు.

# తాగునీటి సరఫరాపై వీడియోకాన్ఫరెన్స్

హైదరాబాద్: రాష్ట్రంలోని తాగునీటి సరఫరా వ్యవస్థపై పంచాయతీ గ్రామీణాభివద్ధి, మిషన్ భగీరథ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జిల్లా పంచాయతీరాజ్ అధికారులతో ప్రస్తుత తాగునీటి పరిస్థితిపై చర్చించారు. ఇందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగానికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. మార్చి నెల ఏడు నుంచి 15 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలనీ, గ్రామీణ మంచినీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన అన్ని మౌళిక సదుపాయాలకు మరమ్మత్తులు చేయాలని సూచించారు. వార్షిక నిర్వహణ పనులు



పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన రోజువారి నివేదికలను ప్రభుత్వానికి పంపాలని చెప్పారు. గ్రామాల్లో ఈ వేసవి కాలంలో మంచినీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్లు పూర్తి బాధ్యత వహించాలనీ ఆదేశించారు.

# జెండాపాటతో పొంతనలేదు

**- పాటకు విరుద్ధంగా మిర్చి కొనుగోళ్లు**

**- ధరల్లో వ్యత్యాసంపై తెలంగాణ రైతు సంఘం ఆగ్రహం**

**- క్వింటాల్‌కు రూ.4 నుంచి 5వేలు తగ్గించడమేంటని ప్రశ్న**

**- రైతులతో మాట్లాడి.. మార్కెట్ అధికారులతో చర్చలు**

**- గిట్టుబాటు ధర కల్పించకపోతే పోరాటం : రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు**

ఖమ్మం: ఖమ్మం మిర్చి మార్కెట్‌లో రైతు దగాపై తెలంగాణ రైతు సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండాపాటతో సంబంధం లేకుండా కొనుగోళ్లు చేస్తుండటంపై మండిపడ్డారు. జెండా పాట రూ.20వేలకు పైగా పలుకుతుంటే.. ఒకటి, రెండు లాట్లకు మాత్రమే ఆ ధర చెల్లించి మిగతా సరుకునంతా రూ.15వేల లోపే కొనడమేంటని మార్కెట్ అధికారులను ప్రశ్నించారు. వ్యాపారుల ఆగడాలు నియంత్రించి, రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు చేస్తామని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు హెచ్చరించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రైతుసంఘం నేతలు సోమవారం సందర్శించారు. ధరల తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. క్వింటా రూ.14వేలకే ఎక్కువ సరుకును కొనుగోలు చేస్తున్నట్టు రైతులు నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఇదేమంటే తేమశాతం అధికంగా ఉందని చెబుతున్నారని, ఇంతగా ఎండలు కొడుతున్న సమయంలో తేమ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. జెండా పాటను అస్సలు పరిగణలోకే తీసుకోవడం లేదని మొరపెట్టుకున్నారు.

మార్కెట్ అధికారులతో చర్చలు.. జెండా పాటకు విరుద్ధంగా




కొనుగోలు చేస్తుండటంపై రైతులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నా.. ఆ పరిస్థితి నుంచి రైతులను బయటపడవేయడంలో వస్తున్న ఇబ్బందులు ఏంటని రైతుసంఘం నేతలు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డిని ప్రశ్నించారు. వ్యాపారులతో మాట్లాడి మిర్చికి గిట్టుబాటు ధర లభించేలా చూడకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది తెగుళ్లు, వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గిందని, అటువంటి పరిస్థితుల్లో రైతులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. మార్కెట్‌ను సందర్శించిన రైతుసంఘం నేతల్లో జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు తాతా భాస్కర్‌రావు, ఎస్‌కే మీరా, వాసిరెడ్డి ప్రసాద్, బండి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు చెరుకుమల్లి కుటుంబరావు, బాణాల శ్రీనివాసరావు, యనమిద్ది రామకృష్ణ, నాగసులోచన, ఎస్‌కే బాబు ఉన్నారు. మిర్చి మార్కెట్‌లో ధరల్లోని వ్యత్యాసాన్ని ప్రశ్నిస్తూ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావుతో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# ఎన్నికల షెడ్యూల్ విడుదల వేళ..

ఏపీలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం వేడెక్కింది. షెడ్యూల్ విడుదలకు ఎంతో సమయం లేదు. ఇంకో 10 రోజుల్లో షెడ్యూల్ విడుదల కావడం ఖాయంగా కనిపిస్తోంది. లోక్‌సభతో పాటు ఏపీలో అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్‌ను షెడ్యూల్ చేస్తుంది కేంద్ర ఎన్నికల కమిషన్. షెడ్యూల్ విడుదల గడువు సమీపిస్తోన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూకుడు పెంచారు. వరుసగా జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. నేడు ఆయన విశాఖపట్నంలో పర్యటించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్-వీఎంఆర్డీఏ సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1,500 కోట్ల రూపాయల విలువ చేసే అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. బుధవారం ప్రకాశం జిల్లాకు వెళ్లనున్నారు వైఎస్ జగన్. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్‌ను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.362 లక్షలు, నెల్లూరు- 84,000 ఎకరాలకు, కడప- 27,000 ఎకరాలకు సాగునీటిని అందించడానికి ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టులో భాగం ఈ టన్నెల్. దీని తరువాత 7, 8 తేదీల్లో తన సొంత జిల్లా కడపలో పర్యటించనున్నారు వైఎస్ జగన్. పులివెందుల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. 7వ తేదీన



సాయంత్రం 4 గంటలకు కడప చేరుకుంటారు. అక్కడి నుంచి ఇడుపులపాయ చేరుకుంటారు. వైఎస్సార్ మెమోరియల్ పార్కును ప్రారంభిస్తారు. రాత్రి ఇడుపులపాయ వైఎస్సార్ ఎస్టేట్‌లోని గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. 8వ తేదీన ఉదయం 8:20 నిమిషాలకు ఇడుపులపాయ గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి పులివెందుల చేరుకుంటారు. వైఎస్సార్ ప్రభుత్వ ఆసుపత్రి, మినీ సెక్రటేరియట్ కాంప్లెక్స్, వైఎస్సార్ జంక్షన్ ప్రారంభిస్తారు. అక్కడే సెంట్రల్ బౌల్ వార్డ్, అనంతరం వైఎస్ జయమ్మ షాపింగ్ కాంప్లెక్స్‌ను చేరుకుని ప్రారంభిస్తారు. అనంతరం వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, ఆదిత్యా బిర్లా యూనిట్ ఫేజ్ 1, సంయూ గ్లాస్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు.

# మస్క్ ఔట్.. ప్రపంచ కుబేరుడిగా అవతరించిన జెఫ్ బెజోస్



అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత, ట్విట్టర్ బాస్ ఎలాన్ మస్క్ మరోసారి ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడి హెూదాను కోల్పోయారు.
ఆయన స్థానంలో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రపంచ నంబర్ 1 కుబేరుడిగా అవతరించారు.
బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ ప్రకారం.. సోమవారం నాడు టెస్లా కంపెనీ షేర్ల విలువ ఏకంగా 7.2 శాతం క్షీణించడంతో మస్క్ సంపద విలువ 197.7 బిలియన్ డాలర్లకు తగ్గింది. దీంతో 200.3 బిలియన్ డాలర్ల సంపదతో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రపంచ సంపన్నుల జాబితా టాప్ ప్లేస్‌లోకి చేరాడు. గత 9 నెలల వ్యవధిలో ప్రపంచ సంపన్నుల జాబితాలో మస్క్ రెండో స్థానానికి పడిపోవడం ఇదే తొలిసారి.
ఇక జెఫ్ బెజోస్ 2021 తర్వాత ప్రపంచ నంబర్ 1 స్థానంలో నిలవడం ఇదే తొలిసారి. 2017లో ఆయన తొలిసారి మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను అధిగమించి నంబర్ 1 స్థానంలో నిలిచారు. అయితే 2021లో టెస్లా షేర్లు క్రమంగా బలపడటంతో మస్క్ సంపద అమాంతం పెరిగిపోయింది. దీంతో బెజోస్ వెనుకబడ్డారు. తిరిగి మళ్లీ ఇప్పుడే అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. మరోవైపు ఫ్రాన్స్‌కు చెందిన లగ్జరీ వస్తువుల ఉత్పత్తి లూయిస్ విట్టాన్ కంపెనీ ఎల్వీఎంహెచ్ అధినేత బెర్నార్డ్ ఆర్నాల్ట్ 197.5 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచ సంపన్నుల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు.

# రూ.2.6 లక్షల కోట్లకు చేరిన బ్యాంకుల క్రెడిట్ కార్డ్ రుణాలు




న్యూఢిల్లీ, మార్చి 4: అన్‌సెక్యూర్డ్ రుణాలపై రిజర్వ్‌బ్యాంక్ రిస్క్ వెయిటేజీ పెంచినప్పటికీ, బ్యాంకుల క్రెడిట్ కార్డ్ రుణాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నాయి.
2024 జనవరి నెలలో బ్యాంకులు క్రెడిట్ కార్డులపై ఇచ్చిన రుణాలు 31.3 శాతం పెరిగి రూ.2.6 లక్షల కోట్లకు చేరాయి. 2023 డిసెంబర్‌లో ఇవి రూ.2.5 లక్షల కోట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ క్రెడిట్ కార్డ్ ఎక్స్‌పోజరు 26.3 శాతం వృద్ధిచెందింది.
అన్‌సెక్యూర్డ్ రిటైల్ రుణాలు బాగా పెరగడం వ్యవస్థాపర రిస్క్‌లకు దారితీస్తుందన్న ఆందోళనల్ని ఆర్బీఐ వ్యక్తం చేస్తూ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చే తనఖాలేని వినియోగ రుణాలపై గత ఏడాది నవంబర్‌లో రిస్క్ వెయిట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. అంటే వాటిపై ఆర్థిక సంస్థలు అధిక కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. దీంతో వ్యక్తిగత రుణాల వృద్ధి డిసెంబర్‌లో 26.6 శాతం ఉండగా, జనవరిలో 23.3 శాతానికి తగ్గింది. కానీ క్రెడిట్ కార్డు రుణాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి.

# కానిస్టేబుల్ పరీక్ష పేపర్ లీకేజీ కేసులో రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ తొలగింపు



లక్నో: పోలీసు రిక్రూట్మెంట్ పేపర్ లీక్ కేసులో.. యూపీ సర్కార్ చర్యలు తీసుకున్నది. పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు చైర్మెన్ రేణుకా మిశ్రాను తొలగించారు. ఫిబ్రవరి 11వ తేదీన జరిగిన పోలీసు పరీక్షను శనివారం రోజున యూపీ సర్కార్ రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ పరీక్షను మళ్లీ ఆరు నెలల్లోగా నిర్వహించాలని ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేశారు. పోలీసు పరీక్ష నియామకంలో పారదర్శకత లోపించినట్లు ఆరోపణలు వచ్చాయి. పేపర్ లీక్ వల్ల పోలీస్ కానిస్టేబుల్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రీఎగ్జామ్‌కు ఉచిత ట్రాన్స్‌పోర్ట్ కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. పేపర్ లీక్ కేసును విచారించేందుకు స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నారు. కానిస్టేబుల్ పరీక్ష కోసం సుమారు 48 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. సోషల్ మీడియా లీకైన పేపర్ సర్క్యులేట్ కావడంతో ఆ పరీక్షను రద్దు చేశారు.

# ప్రిజన్ రాడికలైజేషన్ కేసులో ఏడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు




న్యూఢిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ ఇవాళ ఏడు రాష్ట్రాల్లో సోదాలు చేస్తోంది. ప్రిజన్ రాడికలైజేషన్ కేసులో ఆ తనిఖీలు చేపట్టింది.
లష్కరే తోయిబా ఉగ్రవాదులు జైలు ఖైదీలను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసుతో లింకున్న ప్రదేశాల్లో ఇవాళ ఎన్ఐఏ సోదాలు నిర్వహిస్తోంది. కర్నాటక, తమిళనాడుతో పాటు మరో అయిదు రాష్ట్రాల్లోని 17 ప్రదేశాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. బెంగుళూరు సిటీ పోలీసుల ఈ కోణంలో తొలి సారి కేసు నమోదు చేశారు. గత ఏడాది ఆయుధాలు, మందుగుండ సామాగ్రి స్వాధీనం చేసుకున్న తర్వాత పోలీసులు కేసు బుక్ చేశారు.
ఏడు పిస్తోళ్లు, నాలుగు హ్యాండ్ గ్రానేడ్లు, 45 లైవ్ రౌండ్లు, నాలుగు వాకీటాకీలు సీజ్ చేశారు. ఆ కేసులో అయిదుగుర్ని తొలుత అరెస్టు చేశారు. వాళ్లను విచారించిన తర్వాత మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అరెస్టు అయిన వారి సంఖ్య ఆరుకు చేరుకున్నది. ఈ కేసులో లష్కరే తోయిబా ఉగ్రవాది టీ నజీర్ ప్రధాన సూత్రధారిగా ఉన్నారు. బెంగుళూరు సెంట్రల్ జైలులో ఉన్న అయిదుగుర్నిఅతను రాడికలైజ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో జునైద్ అహ్మద్ అనే వ్యక్తి కూడా నిందితుడే. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు.
బెంగుళూరు సెంట్రల్ జైలులో 2013 నుంచి నజీర్ ఖైదీగా ఉన్నాడు. 2017లో కొంత మంది ఖైదీలు చేరడంతో వాళ్లను రాడికలైజ్ చేసి పనిలో పడ్డాడు అతను. గత అక్టోబర్‌లో ఈ కేసును ఎన్ఐఏ తీసుకున్నది. ఆ తర్వాత రెయిడ్స్ నిర్వహించింది.

# మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా?.. తమిళనాడు మంత్రి ఉదయనిధికి సుప్రీం మందలింపు



న్యూఢిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు యువజన సంక్షేమ, క్రీడల శాఖ మంత్రి, సినీ నటుడు ఉదయనిధి స్టాలిన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా మందలించింది.
వాక్ స్వాతంత్ర్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేశారని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తనపై నమోదైన అన్ని కేసులను కలిపి విచారించాలంటూ ఎందుకు పిటిషన్ వేశారని ప్రశ్నించింది. ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని, మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఎలాంటి పరిణామాలు తలెత్తుతాయో ఆలోచించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం హెచ్చరించింది. 'రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను మీరు దుర్వినియోగం చేశారు.
ఇప్పుడు నేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు ఆర్టికల్ 32 ద్వారా లభించిన హక్కును ఉపయోగించుకుంటున్నారా? మీరేమీ సాధారణ వ్యక్తి కాదు. ప్రస్తుతం మీరొక మంత్రిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీ వ్యాఖ్యల వల్ల తలెత్తే పర్యవసానాలు ఏమిటో మీకు తెలియదా?' అంటూ ధర్మాసనం నిలదీసింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడైన ఉదయనిధి స్టాలిన్ గతేడాది సెప్టెంబర్‌లో ఓ సమావేశంలో మాట్లాడుతూ.. సనాతన ధర్మం కరోనా వైరస్, మలేరియా, డెంగ్యూ లాంటిదని.. సామాజిక న్యాయానికి, సమానత్వానికి విరుద్ధమైనదని.. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. దీంతో ఆయనపై వివిధ రాష్ట్రాల్లో పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఉదయనిధి వ్యాఖ్యలను తాను సమర్థించడం లేదని, ఆయనపై నమోదైన అన్ని కేసులను కలిపి విచారించాలని మాత్రమే కోరుతున్నానని ఆయన న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సుప్రీం కోర్టును కోరారు.

# వందేభారత్ రైలులో అందించిన పెరుగులో ఫంగస్.. షాకైన ప్రయాణికుడు



రైళ్లలో అందించే ఫుడ్ క్వాలిటీపై ప్రయాణికుల నుంచి ఎప్పుడూ అభ్యంతరాలు వ్యక్తమవుతూనే ఉంటాయి. భోజనం బాగోలేదనో, ఏవైనా పురుగులు పడటం వంటి ఫిర్యాదులు అందుతూనే ఉంటాయి.
ఎన్ని ఫిర్యాదులు అందినా మార్పు మాత్రం రావడం లేదు. మళ్లీ మళ్లీ ఇలాంటి ఘటనలే తరచూ పునరావృతం అవుతూ ఉన్నాయి. ఇప్పుడు ప్రతిష్టాత్మక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సెమీహైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అందించే ఆహారంపై గత కొన్ని రోజులుగా ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. సాధారణ రైళ్లలో కంటే వందేభారత్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ఫుడ్ మాత్రం సరిగా ఉండటం లేదని.. పాచిపోయిన, పురుగులు పడిన ఆహారం వచ్చిందంటూ ప్రయాణికుల నుంచి ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. తాజాగా అలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. భోజనంలో భాగంగా వడ్డించిన పెరుగు లో ఫంగస్ కనిపించింది.
హర్షద్ తోప్కర్ అనే వ్యక్తి డెహ్రాడూన్ నుంచి ఢిల్లీలోని ఆనంద్ విహార్ వరకూ వందే భారత్ ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో ప్రయాణించాడు. ఆ సమయంలో అతనికి రైలులో భోజనంలో భాగంగా వడ్డించిన పెరుగులో ఫంగస్ కనిపించింది. అది చూసిన అతడు ఒక్కసారిగా షాక్ అయ్యాడు. వెంటనే ఫొటోలు తీసి ఎక్స్ వేదికగా పోస్టు పెట్టాడు. ఈ పోస్ట్‌ను నార్తర్న్ రైల్వే, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అధికారిక ఖాతాలకు ట్యాగ్ చేస్తూ రైల్వే శాఖకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం అతని పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.
హర్షద్ తోప్కర్ ట్వీట్‌పై రైల్వే సేవా స్పందించింది. ప్రయాణ వివరాలను పంచుకోవాలని, వివరాల ఆధారంగా దర్యాప్తు చేస్తామని తెలిపింది. మరోవైపు నార్తర్న్ రైల్వే కూడా హర్షద్ పోస్ట్‌కి ప్రతిస్పందించింది. ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఖాతాకు ట్యాగ్ చేసింది.

# ఢిల్లీలో ఐదేళ్ల కనిష్టానికి ఉష్ణోగ్రతలు



తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతుంటే.. ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం చలికి గజగజ వణుకుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. తాజాగా రాజధాని నగరంలో ఐదేళ్ల కనిష్టానికి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి మంగళవారం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. గత ఐదేళ్లలో మార్చి నెలలో ఇంత తక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి. అంతకు ముందు 2019 మార్చి 1న దేశ రాజధానిలో 6.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు మార్చి 5న 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# కోల్‌కతా హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యా రాజీనామా..



న్యూఢిల్లీ: కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆయన ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు.
కోల్‌కతా హైకోర్టు చీఫ్ జస్టిస్ టీఎస్ శివగ్నానమ్‌ను కలుసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. తొలుత ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి తన రాజీనామాను ఆయన ప్రకటించాలనుకున్నారు. కానీ భారీ సమూహాలపై నిషేధ ఆజ్ఞలు ఉన్న కారణంగా ఆ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను రద్దు చేశారు.
గంగోపాధ్యాయ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బెంగాల్‌లోని తామ్‌లుక్ నియోజకవర్గం నుంచి ఆయన బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తామ్‌లుక్ స్థానంలో సాధారణగా తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం ఎక్కువగా ఉంటుంది. 2009 నుంచి 2016 వరకు ఆ స్థానం నుంచి సువేంధు అధికారి గెలిచారు. ఆ సమయంలో ఆయన్ను సీఎం మమతాకు రైట్‌హ్యాండ్‌గా భావించారు.

# ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబకు ఊరట..



ముంబై: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబకు ఊరట లభించింది. మావోయిస్టులతో లింకున్న కేసులో ఆయన్ను బాంబే హైకోర్టు నిర్దోషిగా తేల్చింది. ఈ కేసులో 54 ఏళ్ల సాయిబాబతో పాటు మరో అయిదుగుర్ని 2017లో సెషన్స్ కోర్టు దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ బాంబే హైకోర్టు ఆ కేసులో తీర్పును వెలువరించింది. అంగవైకల్యం ఉన్న సాయిబాబను నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో దాఖలైన పిటీషన్‌ను అక్టోబర్ 14, 2022న సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఈ కేసును హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం ఆదేశించింది. ప్రస్తుతం ప్రొఫెసర్ సాయిబాబ.. నాగపూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సాయిబాబకు మావోలతో లింకు ఉన్నట్లు 2017లో గడ్చిరోలిలోని సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది. దేశానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. గడ్చిరొలిలో ఉన్న మావోలకు కావాల్సిన విప్లవ సాహిత్యం సాయిబాబ వద్ద ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. సెషన్స్ కోర్టు పిటీషన్‌ను .. బాంబే హైకోర్టులో ఆయన ఛాలెంజ్ చేశారు. నిందితులపై ఎటువంటి ఆధారాలను చూపించలేకపోయారని, దాని వల్ల సాయిబాబను నిర్దోషిగా ప్రకటిస్తున్నట్లు జస్టిస్ వినయ్ జోషి, వాల్మీకి మెనిజేస్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.
యూఏపీఏ కింద నిందితుల్ని బుక్ చేయాలని చేసిన ప్రతిపాదనను కూడా కోర్టు కొట్టిపారేసింది. 50వేల పూచీకత్తుపై నిందితుల్ని రిలీజ్ చేయవచ్చు అని హైకోర్టు తెలిపింది. అయితే ఈ కేసులో సుప్రీంను రాష్ట్ర సర్కార్ ఆశ్రయించనున్నది.

# పాకిస్థాన్ నూతన ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కి మోదీ శుభాకాంక్షలు



పొరుగు దేశం పాకిస్థాన్ నూతన ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ మేరకు మంగళవారం ఉదయం ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'పాకిస్థాన్ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన షెహబాజ్ షరీఫ్‌కు అభినందనలు' అని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.
ఫిబ్రవరి 8న జరిగిన పాకిస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో షరీఫ్‌కు చెందిన పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) పార్టీ రెండో స్థానంలో నిలిచింది. జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులు అత్యధిక స్థానాలను గెలుచుకున్నారు. అయితే పార్లమెంటులో మెజారిటీని పొందలేకపోయారు. దీంతో షెహబాజ్ షరీఫ్ పార్టీ పాక్‌లో అధికారం చేపట్టింది.
ఈ క్రమంలోనే పాక్ 24వ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేశాధ్యక్షుడు అరిఫ్ అల్వీ.. షరీఫ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్ష భవనంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి నవాజ్ షరీఫ్, మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, పీపీపీ చైర్మెన్ బిలావాల్ భుట్టో హాజరయ్యారు. పీఎంఎల్-ఎన్, పీపీపీ మధ్య అధికారం కోసం డీల్ జరిగిన తర్వాతే ప్రధానిగా షెహబాజ్ ప్రమాణం చేశారు. కొత్తగా దేశాధ్యక్ష బాధ్యతలను అసిఫ్ అలీ జర్దారి చేపట్టనున్నారు. ఇక షెహబాజ్ గతంలోనూ పాక్ ప్రధాన మంత్రిగా పనిచేశారు. ఏప్రిల్ 2022 నుంచి ఆగస్టు 2023 వరకు ఆయన తొలిసారి ప్రధాని బాధ్యతలను నిర్వర్తించారు.

# సెంట్రల్ కాంట్రాక్ట్ కోసం పాక్ పేసర్ తిప్పలు.. బోర్డు కరుణించేనా..?

పాకిస్థాన్ స్టార్ పేసర్ హ్యారిస్ రవుఫ్ గాయం కారణంగా పాకిస్థాన్ సూపర్ లీగ్ కు దూరమైన విషయం తెలిసిందే. వరుస గాయలతో సతమతమవుతున్న అతడు తాజాగా తన సెంట్రల్ కాంట్రాక్ట్ విషయమై ఆ దేశ క్రికెట్ బోర్డును ఆశ్రయించాడు.

తన కాంట్రాక్ట్‌ను పునరుద్దరించాల్సిందిగా బోర్డు పెద్దలను కోరాడు. దాంతో, బోర్డు సానుకూలంగా స్పందించిందినట్టు సమాచారం. త్వరలోనే అతడి సెంట్రల్ కాంట్రాక్ట్‌ను పీసీబీ పునరుద్దరించే అవకాశం ఉంది. హ్యారిస్ రవుఫ్ విజ్ఞప్తిని బోర్డు అంగీకరించే చాన్స్ ఉంది. అదే జరిగితే అతడు తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్‌లోకి వస్తాడు అని పీసీబీ అధికారి ఒకరు వెల్లడించారు.

పాక్ పేస్ త్రయంలో ఒకడైన హ్యారిస్ నిరుడు సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాడు. ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో ఆడకుండా బిగ్ బాష్ లీగ్ కు వెళ్లాడు. దాంతో, ఆగ్రహించిన పాక్ బోర్డు అతడి కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. అనంతరం స్వదేశంలో జరుగుతున్న పీఎస్ఎల్‌లో రవుఫ్ గాయపడ్డాడు. లాహోర్ క్యాలండర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు ఫిబ్రవరి 23న కరాచీ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. స్కానింగ్ పరీక్షల్లో అతడి భుజం ఎముక కొంచెం పక్కకు జరిగినట్టు తేలింది. దాంతో, ఈ స్పీడ్‌స్టర్ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. మరో రెండు నెలల్లో పొట్టి ప్రపంచకప్ ఉందనగా రవుఫ్ గాయడడంతో పాక్ శిబిరంలో ఆందోళన పెంచింది.




భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే హైటెన్షన్ ఉంటుంది. చిరకాల ప్రత్యర్థుల పోరులో టీమిండియా పైచేయి సాధిస్తూ వస్తోంది. అయితే.. 2022లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో మాత్రం పాక్ ఆ రికార్డు బ్రేక్ చేస్తుందనిపించింది.

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో రవుఫ్ వేసిన 19వ ఓవర్లో విరాట్ కోహ్లీ రెచ్చిపోయాడు. ఐదో బంతిని హ్యారిస్ తల మీదుగా స్టాండ్స్‌లోకి పంపించాడు. ఆ తర్వాత బంతిని స్కూప్ షాట్‌తో సిక్సర్‌గా మలిచాడు. 160 టార్గెట్ ఛేదనలో అతను 53 బంతుల్లో 82 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# కోహ్లీకి అది నచ్చలేదు.. అందుకే ఆ రోజు మైదానంలో గొడవ

వన్డే వరల్డ్ కప్ అనంతరం వన్డేలకు వీడ్కోలు పలికిన అఫ్ఘనిస్థాన్ పేసర్ నవీన్ ఉల్ హక్ టీ20 లీగ్స్‌లో రాణిస్తున్నాడు.

ప్రస్తుతం ఈ స్పీడ్‌స్టర్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ కోసం ఎదురుచూస్తున్నాడు. మరో పదిహేడు రోజుల్లో సీజన్ మొదలవ్వనుందనగా నవీన్ షాకింగ్ విషయాలు చెప్పాడు. 16వ సీజన్‌లో విరాట్ కోహ్లీతో గొడవ గురించి పలు సంచలన విషయాలు వెల్లడించాడు. జల్మి టీవీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన నవీన్.. 'బెంగళూరుతో మా తరహా గేమ్ ఆడాలనుకున్నాం. అనుకున్నట్టే మేము గెలిచాం. అది చాలా క్లోజ్ గేమ్. అందుకని అవేశ్ ఖాన్ విజయోత్సాహంలో తన హెల్మెట్‌ను నేలకేసి కొట్టాడు. అతడు అలా ప్రవర్తించడం కోహ్లీకి నచ్చలేదనుకుంటా. ఆ తర్వాత ఆర్సీబీ లక్నోకు వచ్చింది. అప్పుడు 9 లేదా 10వ స్థానంలో బ్యాటింగ్‌కు వెళ్లాను. ఆ మ్యాచ్‌ను మేము చేజార్చుకున్నాం. అయితే.. ఆ మ్యాచ్‌లో నన్ను స్లెడ్జింగ్ చేస్తారని ఊహించలేదు. కోహ్లీ, సిరాజ్ నన్ను అనవసరంగా తిట్టారు. ఎవరైనా నన్ను ఏమన్నా అంటే నేను సైలెంట్‌గా ఉండేరకం కాదు. మ్యాచ్ అనంతరం షేక్‌హ్యాండ్ సమయంలోనూ ఆ గొడవ కొనసాగింది' అని వెల్లడించాడు. అంతేకాదు చిన్నస్వామి స్టేడియంలో లక్నో మెంటార్ గౌతం గంభీర్ నోటిపై వేలు పెట్టి .. జోక్యం చేసుకోవడంపై కూడా నవీన్ ఉల్ హక్ స్పందించాడు. 'చివరి బంతికి లక్నో జట్టు విజయం తర్వాత గంభీర్ నోటిపై వేలు పెట్టుకొని నిశబ్ధంగా ఉండాలని ఆర్సీబీ అభిమానులకు సూచించాడు. అతడు అలా ఎందుకు చేశాడంటే.. అంతకుముందు మ్యాచ్‌లో ఆఖరి బంతికి ఒక్క పరుగు కావాలి. అప్పుడు ప్రత్యర్థి బౌలర్ నాన్‌స్ట్రయికర్‌ను రనౌట్ చేసేందుకు ప్రయత్నించాడు. దాంతో, గంభీర్ కోపం నశాలానికి పాకింది. అయితే..



ఆ మ్యాచ్ చాలా గొప్ప మ్యాచ్. కానీ, ఆటగాళ్ల పోరాటం కంటే గొడవనే హైలెట్ అయింది. అందుకనే గంభీర్ ఆర్సీబీ ఫ్యాన్స్‌ను సైలెంట్‌గా ఉండాలని అలా ప్రవర్తించాడు. అతడు నిజంగా ఆటను ఎంతో ప్రేమిస్తాడు. కోహ్లీ కూడా అంతే' అని నవీన్ చెప్పుకొచ్చాడు. మైదానంలోనే తెరదించారు నవీన్, కోహ్లీలు మైదానంలోనే గొడవపడడం అప్పట్లో మీడియాలో వైరల్ అయింది. ఆ తర్వాత ఈ అఫ్గన్ స్పీడ్‌స్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో 'స్వీట్ మ్యాంగోస్' ఫొటోతో కోహ్లీ అభిమానులు ఆగ్రహానికి గురయ్యాడు. అయితే.. అయితే.. రెండోసారి లక్నో, ఆర్సీబీ ఎదురుపడినప్పుడు కోహ్లీ, నవీన్ నవ్వుతూ పలకరించుకున్నారు. ఇద్దరూ హుందాగా నడుచుకొని మైదానంలో మొదలైన గొడవకు మైదానంలోనే తెరదించారు. వన్డే వరల్డ్ కప్ అనంతరం నవీన్ వన్డేలకు వీడ్కోలు పలికాడు. ఇకపై టీ20ల్లో మాత్రమే అతడు కనిపించనున్నాడు. ఐపీఎల్ 16వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు ఆట కంటే వివాదాలతో వార్తల్లో నిలిచాడు. అయినా సరే 17వ సీజన్‌కు లక్నో రీటైన్ చేసుకుంది.

# ఇటలీ హెూటల్‌లో దొంగతనం.. డబ్బుతో పరారైన పాక్ బాక్సర్

పాకిస్థాన్ యువ బాక్సర్ జొహైబ్ రషీద్ దేశం పరువు తీశాడు. ఇటలీలో జరుగుతున్న ఒలింపిక్స్ క్వాలిఫయర్ కు ఎంపికైన రషీద్ దొంగతనానికి పాల్పడ్డాడు. అది కూడా సొంత దేశానికి చెందిన ఆటగాళ్ల డబ్బును కాజేశాడు. అనంతరం చెప్పా పెట్టకుండా ఇటలీ నుంచి పరారయ్యాడు. మంగళవారం పాకిస్థాన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఫెడరేషన్ ఈ విషయాన్ని వెల్లడించింది. అంతేకాదు ఇటలీలో ఉన్న పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో రషీద్‌పై ఫిర్యాదు చేసింది.

'ఒలింపిక్స్ క్వాలిఫయర్ పోటీల్లో పాల్గొనేందుకు ఇటలీ చేరుకున్న ఐదుగురు సభ్యుల్లో రషీద్ ఒకడు. కానీ, అతడు దొంగతనానికి పాల్పడడం బాక్సింగ్ ఫెడరేషన్‌తో పాటు పాకిస్థాన్‌కు ఎంతో అవమానకరం.

మహిళా బాక్సర్ లారా ఇక్రమ్ ట్రైనింగ్‌కు వెళ్లింది. అదే అదనుగా భావించిన రషీద్ డెస్క్ నుంచి ఆమె గది తాళాలు తీసుకున్నాడు. ఆమె బ్యాగులోని విదేశీ కరెన్సీ దొంగిలించి టీమ్ హెూటల్ నుంచి పారిపోయాడు' అని జాతీయ సమాఖ్య సెక్రటరీ కల్నల్ నసీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపాడు. పాక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఫిర్యాదుతో ఇటలీ



పోలీసులు, పాకిస్థాన్ ఎంబసీ అధికారులు రషీద్ కోసం వేట మొదలెట్టారు. నిరుడు ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ లో రషీద్ కాంస్య పతకం నెగ్గాడు. దాంతో, భావి బాక్సర్‌గా పాక్ మీడియా అతడిని ఆకాశానికెత్తేసింది. కానీ, అతడు మాత్రం తన పాడు బుద్ధితో దేశం పరువు తీశాడు. దాంతో, రషీద్‌పై పాక్ మీడియా దుమ్మెత్తిపోస్తోంది.

# వేధిస్తున్న గాయాలు.. బ్యాడ్మింటన్‌కు సాయిప్రణీత్ గుడ్‌బై

### తనకు మద్దతుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ క్రీడకు యువ షట్లర్ సాయిప్రణీత్ వీడ్కోలు పలికాడు. గత కొన్నేండ్లుగా గాయాలతో సతమతమవుతున్న సాయిప్రణీత్ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు సోమవారం తన ఎక్స్(ట్విటర్) వేదికగా ప్రకటించాడు. గాయాలతో ఫిట్‌నెస్ పరంగా సమస్యలు ఎదుర్కొంటున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ప్రణీత్ పేర్కొన్నాడు. ఈ తన సుదీర్ఘ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికి ప్రణీత్.. కృతజ్ఞతలు తెలిపాడు. అమెరికాలో ఒక క్లబ్‌కు సేవలు అందించబోతున్నట్లు తన భవిష్యత్ ప్రణాళికను వివరించాడు. దేశ బ్యాడ్మింటన్‌పై తనదైన ముద్ర వేసిన సాయి ప్రణీత్.. కెరీర్‌కు వీడ్కోలు పలుకడంపై స్పందిస్తూ 'డియర్ బ్యాడ్మింటన్ థాంక్యూ.. అన్ని రకాల భావాల మేళవింపుతో ఇది రాసుకొస్తున్నాను. బ్యాడ్మింటన్‌తో 24 ఏండ్లకు పైగా ఉన్న సుదీర్ఘ అనుబంధానికి ముగింపు పలుకుతూ రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాను. ఈ రోజు నుంచి కెరీర్‌లో కొత్త చాప్టర్ మొదలుపెడుతున్నాను. నేను ఈ స్థాయికి చేరుకోవడానికి కారణమైన అందరికీ రుణపడి ఉంటాను. అభిమానుల అపూర్వ మద్దతు.. నా గొప్ప బలం. ప్రతీసారి మీరు ఇచ్చిన సపోర్ట్.. జెండా ఎగిరినప్పుడల్లా నా ఆత్మవిశ్వాసం అంతకంతకూ పెరుగుతూ నమ్మకం బలపడింది. నా కెరీర్‌లో మీరు భాగం కావడం ఆశీస్సులకు ఏ మాత్రం తక్కువ కాదు. బ్యాడ్మింటన్ ఆటపై నాది తొలిప్రేమ, నేను గుర్తింపులోకి వచ్చింది ఆట ద్వారా మాత్రమే. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభూతులు, ఎన్నో అడ్డంకులను అధిగమించాను. అవి నా హృదయంలో పదిలంగా ఉంటాయి. ఈ సందర్భంగా నాకు మద్దతు నిలిచిన తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్, భార్య శ్వేత.. మీ మద్దతు నా కెరీర్ ఉన్నతికి ఎంతగానో దోహదపడింది. మీ సహకారం లేకపోతే.. ఇది సాధ్యపడకపోయేది. గోపీచంద్ అన్నకు హృదయపూర్వక కృతజ్ఞతలు. అకాడమీకి, కోచింగ్, సహాయ సిబ్బందికి అందరికీ థ్యాంక్స్. కెరీర్ తొలినాళ్లలో తీర్చిదిద్దిన ఆరిఫ్ సార్, గోవర్ధన్ సార్‌కు ధన్యవాదాలు. బాయ్‌కు, సాయ్‌కు, సాట్స్‌కు, బెంగళూరు ర్యాప్టర్స్,




హైదరాబాద్ హంటర్స్, అవధే వారియర్స్ అందరికీ కృతజ్ఞతలు. ఇక్కడితో బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నాను. కానీ ఆటతో నా అనుబంధం కొనసాగుతుంది. అది ప్లేయర్‌గా గాకుండా కోచ్‌గా, మెంటార్‌గా ఏదో ఒక రూపంలో ఆట అభివృద్ధిలో భాగమవుతాను' అని రాసుకొచ్చాడు.

రెండు దశాబ్దాల కెరీర్ కల్గిన హైదరాబాద్ షట్లర్ సాయిప్రణీత్.. తన భవిష్యత్ ప్రణాళికను వెల్లడించాడు. 2017లో సింగపూర్ ఓపెన్ గెలిచిన ఈ 31 ఏండ్ల యువ షట్లర్ 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10 ర్యాంకింగ్స్‌లో నిలువడం ద్వారా ప్రతిష్ఠాత్మక టోక్యో(2020) ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. అయితే ఆడిన మూడు లీగ్ మ్యాచ్‌ల్లో ఓడటం ద్వారా మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు. అప్పటి నుంచి చాలాసార్లు గాయాల పాలు అవుతున్న సాయిప్రణీత్ పూర్తి స్థాయిలో ఆటతీరు ప్రదర్శించడంలో విఫలమవుతూ వచ్చాడు. ఓవైపు యువ షట్లర్లతో పోటీ నెలకొనడం, ఫిట్‌నెస్ సమస్యలు ఇబ్బంది పెట్టడం అతనికి కెరీర్‌కు ప్రతిబంధకంగా మారాయి. ఇదిలా ఉంటే అమెరికాలోని ట్రయాంగిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో హెడ్‌కోచ్‌గా ప్రణీత్ బాధ్యతలు నిర్వర్తించబోతున్నాడు. అక్కడ ప్లేయర్ల ఆటతీరును పరిశీలించనున్నాడు. తన పాత్రపై త్వరలో మరిన్ని విషయాలు వెల్లడిస్తానని ఈ సందర్భంగా ప్రణీత్ పేర్కొన్నాడు.

# తండ్రే కాదు కొడుకూ ఘనుడే.. అండర్-13 ట్రోఫీ గెలిచిన జూనియర్ రొనాల్డో

స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో తన ఆటతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. ఇప్పుడు అతడి అతడి కుమారుడు క్రిస్టియానో జూనియర్ కూడా సాకర్ ఆటలో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న క్రిస్టియానో అల్ నస్రీ క్లబ్ తరఫున తొలి టైటిల్ గెలిచాడు.

అల్ నస్రీ జట్టు అండర్ -13 క్లబ్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. దాంతో, రొనాల్డో పుత్రోత్సాహంలో మునిగి తేలుతున్నాడు. అభిమానులేమో తండ్రీకొడుకులు ఒకే క్లబ్ తరఫున ఇరదీస్తున్నారు అంటూ కామెంట్లు పెడుతున్నారు.

తండ్రి మాదిరిగానే క్రిస్టియానో జూనయిర్ కూడా 7వ నంబర్ జెర్సీతో ఆడుతాడు. అండర్-13 జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఈమధ్యే ఒహద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో క్రిస్టియానో అదరగొట్టాడు. దాంతో, అల్ నస్రీ క్లబ్ 4-1తో గెలుపొంది అండర్ -13 టైటిల్ విజేతగా అవతరించింది.

ప్రపంచంలోని మేటి సాకర్ అటగాడైన రొనాల్డోకు ఈమధ్య భారీ షాక్ తగిలింది. మైదానంలో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు అతడిపై ఒక మ్యాచ్ నిషేధం పడింది. అంతేకాదు రూ. 2 లక్షల జరిమానా కూడా చెల్లించనున్నాడు. సౌదీ అరేబియా లీగ్‌లో భాగంగా ఫిబ్రవరి




25న అల్ నస్రీ, అల్ షాబాద్ జట్లు తలపడ్డాయి. మ్యాచ్ సమయంలో కొందరు మెస్సీ మెస్సీ అంటూ నినాదాలు చేశారు. దాంతో, కోపంతో ఊగిపోయిన రొనాల్డో వాళ్లవైపు తిరిగి తన పురుషాంగం చూపిస్తూ.. 'మీరు ఏమీ పీకలేర'నే అర్థం వచ్చేలా పోజు పెట్టాడు.

దాంతో, అల్ షాదాబ్ క్లబ్ అతడిపై సౌదీ లీగ్ క్రమశిక్షణ, ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేసింది. దాంతో, రొనాల్డోపై ఒక మ్యాచ్ నిషేధంతో పాటు 10,000 సౌదీ రియాల్‌లను జరిమానాగా విధించింది. అంతేకాదు అల్ షాబాద్ జట్టుకు 20,000 సౌదీ రియాల్స్ చెల్లించాల్సిందిగా రొనాల్డోను ఆదేశించింది.

# సన్‌రైజర్స్ కెప్టెన్‌గా కమిన్స్

### మార్క్రామ్‌ను పక్కనపెట్టిన యాజమాన్యం

హైదరాబాద్: ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సారథ్యం వహించనున్నాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు, ఎస్ఏ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్ట్రర్న్‌కేప్ రెండు సార్లు టైటిల్ విన్నింగ్ సారథి ఎడెన్ మార్క్రామ్‌ను ఫ్రాంఛైజీ యాజమాన్యం నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించింది. అంతర్జాతీయ టీ20 లీగ్‌ల్లో పాట్ కమిన్స్ ఏ జట్టుకు కెప్టెన్సీ వహించలేదు.

కానీ ఆస్ట్రేలియాకు నాయకుడిగా విజయవంతమైన కమిన్స్‌పై సన్‌రైజర్స్ యాజమాన్యం నమ్మకం ఉంచింది. తుది జట్టులో విదేశీ ఆటగాళ్ల ఎంపికను సైతం ఈ నిర్ణయం సులభతరం చేయనుందని యాజమాన్యం భావిస్తోంది. ట్రావిశ్ హెడ్, వానిందు హసరంగ, హెన్రిచ్ క్లాసెన్, ఫరూకీ, మార్కో జాన్సెన్, గ్లెన్ ఫిలిప్స్‌లు సన్‌రైజర్స్ శిబిరంలో విదేశీ ఆటగాళ్లుగా కొనసాగుతున్నారు. మార్క్రామ్ కెప్టెన్సీ కోల్పోవటంతో.. కొన్ని మ్యాచుల్లో తుది జట్టులోనూ కనిపించే అవకాశాలు లేవు. పాట్ కమిన్స్‌ను రూ. 20.50 కోట్ల రికార్డు ధరకు




సన్‌రైజర్స్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇక బౌలింగ్ కోచ్‌గా డెల్ స్టెయిన్ స్థానంలో జేమ్స్ ఫ్రాంక్లిన్ (న్యూజిలాండ్)ను నియమించగా, చీఫ్ కోచ్‌గా బ్రియాన్ లారా స్థానంలో డానియల్ వెటోరీ బాధ్యతలు తీసుకున్న సంగతి తెలిసిందే. మార్చి 23న కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌తో ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టైటిల్ వేట షురూ చేయనుంది.

# స్టార్ క్రికెటర్లు అవసరం లేదు

**- యువ జట్టుతోనూ విజయాలు సాధించగలం**

**- లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ వ్యాఖ్యలు**

ముంబయి: భారత క్రికెట్ దిగ్గజం, లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టెస్టు క్రికెట్‌లో భారత జట్టు లోతైన బెంచ్ బలంపై ప్రశంసలు కురిపిస్తూనే, అగ్ర క్రికెటర్లపై పదునైన వ్యాఖ్యలు చేశారు. క్రికెట్ జట్టుగా ఆడే క్రీడ. ఓ ఆటగాడిపై ఆధారపడేది కాదు. ఈ సంగతి తెలుసుకోవాలని చురకలు అంటించారు. 'నేను ఎప్పుడూ చెబుతాను, జట్టులో అగ్ర క్రికెటర్ల అవసరం లేదు. ఎవరైనా అగ్ర క్రికెటర్ తను లేకుంటే జట్టు విజయం సాధించలేదని అనుకుంటే.. 2021 ఆస్ట్రేలియా సిరీస్, 2024 ఇంగ్లాండ్ సిరీస్‌లు అది నిజం కాదని చూపించాయి. అగ్ర క్రికెటర్లు జట్టులో ఉన్నా లేకపోయినా అది పెద్ద విషయమే కాదు. క్రికెట్ టీమ్ స్పోర్ట్. ఓ ఆటగాడిపై ఆధారపడదు' అని సునీల్ గవాస్కర్ అన్నాడు. 'స్వదేశంలో ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో జట్టును నడిపించిన తీరు అమోఘం. ఈ ఘనత కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు దక్కుతుంది. యువ క్రికెటర్లకు అవకాశాలు ఇచ్చారు, వెన్నుతట్టి మద్దతుగా నిలిచారు, సహజశైలిలో ఆడే స్వేచ్ఛ కల్పించారు. జట్టులో అగ్ర క్రికెటర్లు ఉన్నా లేకపోయినా.. పెద్ద మనసు కలిగిన ఆటగాళ్లతో సిరీస్ విజయం సాధించగలమని నిరూపించింది' అని గవాస్కర్ అన్నారు. 2020-21 ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టులో భారత్ దారుణ ఓటమి చవిచూసింది. కెప్టెన్ కెప్టెన్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో స్వదేశం వెళ్లిపోగా.. రహానె సారథ్యంలోని యువ జట్టు గొప్పగా పుంజుకుంది. రిషబ్ పంత్, మహ్మద్ సిరాజ్ సీనియర్లు లేని వేళ రెచ్చిపోయారు. భారత్‌కు చారిత్రక టెస్టు సిరీస్ విజయం కట్టబెట్టారు. ఇక తాజా ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉన్నాడు. గాయంతో కెఎల్ రాహుల్, మహ్మద్ షమి దూరమయ్యారు. అయినా, యువ ఆటగాళ్లు ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్ దీప్‌లు అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. హైదరాబాద్ టెస్టు ఓటమి నుంచి పుంజుకున్న టీమ్ ఇండియా వరుసగా విశాఖపట్నం, రాజ్‌కోట్, రాంచి టెస్టుల్లో విజయాలు సాధించింది. 3-1తో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో చివరి మ్యాచ్ గురువారం నుంచి ధర్మశాల వేదికగా జరుగనుంది. ఎందుకో ఎవరికీ తెలియదు! :

బీసీసీఐ కాంట్రాక్టు జాబితా నుంచి శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను తప్పించటంపై సునీల్ గవాస్కర్ బోర్డుపై విమర్శలు చేశారు. 'బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు క్రికెటర్ల జాబితా విడుదల చేసింది. రంజీ ట్రోఫీలో ఆడలేదని కారణంతో శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లపైయ వేటు వేశారని చెబుతున్నారు. కానీ ఇషాన్ కిషన్ ఎందుకు రంజీ టోర్నీలో ఆడటం లేదో ఎవరికీ తెలియదు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ముంగిట అయ్యర్ రంజీ ట్రోఫీలో ఆడాడు. ఆడనని అయ్యర్ ఎన్నడూ అనలేదు. వెన్నునొప్పితో మూడో టెస్టులో ఆడలేనని అయ్యర్ ఫిజియోకు ఫిర్యాదు చేశాడు. ఎన్‌సీఏ వైద్య బృందం శ్రేయస్ ఫిట్‌నెస్‌కు క్లియరెన్స్ ఇచ్చారు. వైద్యుల క్లియరెన్స్ అయ్యర్‌పై ప్రతికూల ప్రభావం చూపించింది. ఓ ఆటగాడి గాయం నొప్పి ఏ ఫిజియో సైతం తీర్పు చెప్పలేదు'అని మిడ్‌డేకు రాసిన ఓ వ్యాసంలో సునీల్ గవాస్కర్ రాసుకొచ్చారు.

# ఫుట్‌బాల్ హెూమ్ 'సోనీ'!

### యుఈఎఫ్ఏతో మూడేండ్ల ఒప్పందం

ముంబయి: భారత ఉపఖండంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ 'హెూమ్ ఆఫ్ ఫుట్‌బాల్'గా నిలువనుంది. యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (యుఈఎఫ్ఏ)తో సోనీ పిక్చర్స్ మీడియా హక్కుల ఒప్పందాన్ని మరో మూడేండ్లు పొడగించుకుంది. దీంతో చాంపియన్స్




లీగ్, యూరోపా లీగ్, కాన్ఫరెన్స్ లీగ్ మీడియా హక్కులు సోనీ పిక్చర్స్ సొంతం అయ్యాయి. రానున్న మూడేండ్ల పాటు ఈ ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ లీగ్‌ల ప్రత్యక్ష ప్రసారాలను టెలివిజన్, డిజిటల్ వేదికలపై సోనీ పిక్చర్స్ ప్రసారం చేయనుంది. ఈ మేరకు సోనీ పిక్చర్స్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ రాజేశ్ కౌల్ ఓ ప్రకటనలో తెలిపారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**